APBIL/26/A4072.

గోదావరి భవిష్యత్ వార్త

గోదావరి స్పెషల్ బులిటెన్

తెలుగు దినపత్రిక

సంపుటి : 1 | సంచిక : 91 | ఆగస్టు 22 శనివారం 2026 | పేజీలు : 8 | వెల : 2 రూ.

## అలాస్కాలో కుప్పకూలిన చార్టర్ విమానం.. 8మంది మృతి..

న్యూఢిల్లీ: అమెరికాలోని అలాస్కాలో ఘోర విమాన ప్రమాదం చోటుచేసుకుంది. పశ్చిమ అలాస్కాలోని మారుమూల ప్రాంతంలో ఓ చార్టర్ ప్లేన్ కుప్పకూలింది. ఈ ఘటనలో విమానంలో ప్రయాణిస్తున్న 8మంది మృతిచెందినట్లు అమెరికా సైన్యం వెల్లడించింది. ప్రమాదానికి గురైన విమానంలో ఇద్దరు పైలట్లు, ఆరుగురు ప్రయాణికులు ఉన్నట్లు అమెరికా నేషనల్ ట్రాన్స్‌పోర్టేషన్ సేఫ్టీ బోర్డు అలాస్కా ప్రాంత అధికారి క్లింట్ జాన్సన్ తెలిపారు. గురువారం నాడు యాంకరేజ్ నుంచి విమానం బయలుదేరి కేప్ న్యూనెహామ్ ప్రాంతానికి చేరుకుంటుండగా ప్రమాదం జరిగింది. కేప్ న్యూనెహామ్ లాంగ్ రేంజ్ రాడార్ సైట్ సమీపంలోనే కూలిపోయింది. ఈ ప్రాంతం యాంకరేజ్‌కు సుమారు 450 మైళ్ల దూరంలోని మారుమూల ప్రాంతం కావడంతో సహాయక చర్యలకు ఇబ్బందులు ఎదురయ్యాయి. విమాన ప్రమాదంపై సమాచారం అందిన వెంటనే అలాస్కా రెస్క్యూ కోఆర్డినేషన్ సెంటర్.. సెర్చ్ అండ్ రెస్క్యూ ఆపరేషన్ ప్రారంభించింది. తొలుత విమానంలో ఉన్నవారి పరిస్థితిపై స్పష్టమైన సమాచారం అందలేదు. అనంతరం అమెరికా సైన్యం 8 మంది ప్రాణాలు కోల్పోయినట్లు ధ్రువీకరించింది.

## జూబ్లీహిల్స్‌లో.. మగువలవే అధికం..

హైదరాబాద్: హైదరాబాద్ నగరంలో అత్యధిక ఓటర్లు ఉన్న జూబ్లీహిల్స్ నియోజకవర్గం ఇప్పుడు తన స్థానాన్ని చేజార్చుకునేలా కనిపిస్తోంది. సుమారు నాలుగు లక్షలకు పై చిలుకు ఉన్న ఓటర్ల సంఖ్య గణనీయంగా తగ్గింది. సుమారు 44.19 శాతం ఓట్లు జాబితా నుంచి కనుమరుగు కావడంతో వాటిలో కొన్ని ఓట్లైనా తిరిగి రాబట్టుకునేలా కార్యచరణ చేసుకునేందుకు రాజకీయ శిబిరాలు ప్రయత్నాలు ఆరంభించాయి. కేంద్ర ఎన్నికల సంఘం ఎస్ఐఆర్ జాబితాను ఇటీవల ప్రచురించింది. దీని ప్రకారం జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో 1.79 లక్షల ఓట్లు గల్లంతయ్యాయి. అత్యధిక ఓట్లు తొలగించబడిన నియోజకవర్గాల్లో జూబ్లీహిల్స్ మూడోస్థానంలో నిలిచింది. పేరుకు జూబ్లీహిల్స్ అయినప్పటికీ నియోజకవర్గంలో బస్తీలు అత్యధికంగా ఉన్నాయి. మాస్ ఓటర్ల సంఖ్యే ఎక్కువ. ప్రతీ యేట ఇక్కడ ఓటర్ల సంఖ్య పెరుగుతూ వచ్చింది. కేవలం ఐదు సంవత్సరాల వ్యవధిలో సుమారు 79 వేల ఓటర్లు పెరిగారు. ఇక్కడ ఉన్న వారిలో చాలామంది ఇతర రాష్ట్రాలు, జిల్లాల నుంచి వలస వచ్చిన వారే అధికంగా ఉన్నారు. ఎస్ఐఆర్ ప్రకారం ఒకరికి ఒకే ఓటు అని అధికారులు తేల్చి చెప్పారు. దీంతో మెజారిటీ ఓటర్లు పుట్టిన ఊర్లో ఓటు ఉంచుకునేందుకు మొగ్గు చూపించారు. దీంతో ఓటు శాతం గణనీయంగా తగ్గింది.

# పోలీసు స్టేషన్ ముందు రాహుల్ గాంధీ మెరుపు ధర్నా..




కాంగ్రెస్ పార్టీ అగ్రనాయకుడు, లోక్‌సభలో విపక్ష నేత రాహుల్‌గాంధీ ఇటీవల కాలంలో ఉరుములు లేని పిడుగు మాదిరిగా నిరసనలు వ్యక్తం చేస్తున్నారు. ఈ నెల ప్రారంభంలో నీట్ ప్రశ్న పత్రం లీకేజీకి సంబంధించి కాక్రోచ్ జనతా పార్టీ నిరసన వ్యక్తం చేసిన సమయంలో అనూహ్యంగా ఎంట్రీ ఇచ్చిన రాహుల్.. విద్యార్థులపై పోలీసులు లాఠీ ప్రయోగం చేయడాన్ని నిరసించారు. ఈ సమయంలో చెప్పాపెట్టకుండానే ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ నివాసం ముందు సీనియర్ నేతలతో కలిసి మెరుపు ధర్నాకు దిగారు. ప్రధాని మోడీ సమాధానం చెప్పేవరకు నిరసన విరమించే ది లేదని భీష్మించారు. ఇప్పుడు తాజాగా.. మరోసారి రాహుల్ గాంధీ ఇలాంటి మెరుపు ధర్నాకు దిగారు. నాటి పోలీసుల ఘటనకు సంబంధించిన విషయమే ఇప్పుడు కూడా తెరమీదకు తీసుకురావడం గమనా ర్హం. అప్పట్లో విద్యార్థులపై ఢిల్లీ పోలీసులు పెల్లెట్ గన్స్ ప్రయోగించారని రాహుల్ ఆరోపించారు. బాధిత విద్యార్థిని కూడా మీడియా ముందుకు తీసుకువచ్చారు. అయితే.. నాటి ఘటనకు సంబంధించి ఇప్పటి వరకు కేసు పెట్టకపోవడం, బాధితుడికి సరైన వైద్యం చేయకపోవడంపై తాజాగా రాహుల్ మెరుపు ధర్నాకు దిగారు. ఢిల్లీలోని పార్లమెంటు స్ట్రీట్ పోలీస్ స్టేషన్ ఎదుట కుర్చీలు వేసుకుని బాధితుడి కుటుంబ సభ్యులు పలువురు విద్యార్థులతో కలిసి రాహుల్ ధర్నా చేశారు. పెల్లెట్ గన్ ప్రయోగంతో తనకు గాయాలయ్యాయని సాహిల్ లోచాబ్ అనే విద్యార్థి అప్పట్లో చెప్పిన విషయం తెలిసిందే. దీనిపై కేంద్రం కూడా స్పందించాలన్నది డిమాండ్. పోలీసులు ఇప్పటి వరకు ఈ వ్యవహారంపై ఎఫ్ ఐఆర్ నమోదు చేయకపోవడాన్ని రాహుల్ గాంధీ ప్రశ్నిం చారు. ఈ క్రమంలో శుక్రవారం రాహుల్ లోచాబ్‌ను వెంటబెట్టుకుని స్టేషన్‌కు వెళ్లారు. తొలుత రాహుల్ గాంధీ కాన్నాట్ ప్లేస్ పోలీస్ స్టేషన్‌కు వెళ్లారు. అయితే, న్యూఢిల్లీ డీసీపీ సచిన్ శర్మ పార్లమెంటు స్ట్రీట్ పీఎస్‌లో ఉన్నారని తెలియడంతో అక్కడకు వెళ్లారు. రాహుల్ రావడంతో ఊహించని పరిణామం ఎదురైనట్టుగా పోలీసులు నిర్ఘాంత పోయారు. అనంతరం.. విషయం తెలుసుకుని.. ఎఫ్ ఐఆర్ కట్టేది లేదని చెప్పారు. దీంతో ఆ వెంటనే రాహుల్ స్టేషన్ ముందు మెరుపు ధర్నాకు దిగారు.

# ఏసీబీ దాడుల్లో ఏకంగా రూ.100 కోట్ల ఆస్తులు



హైదరాబాద్ లో ఏసీబీ జరిపిన దాడుల్లో మరో అవినీతి తిమింగలం పట్టుబడింది. ఏకకాలంలో 15 చోట్ల నిర్వహించిన దాడులలో ఏకంగా వంద కోట్ల విలువైన ఆస్తులు బహిర్గతం అయ్యాయి. రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం ఆర్డీఓ కార్యాలయంలో తహసీల్దార్ గా విధులు నిర్వహిస్తున్న దేశాని శ్రీనివాస్ రెడ్డి నివాసాల మీద అవినీతి నిరోధక శాఖ అధికారులు దాడులు చేశారు. అధికారిక రికార్డుల ప్రకారం ఈ దాడుల్లో పట్టుబడిన ఆస్తుల విలువ రూ.6.87 కోట్లుగా కనిపిస్తున్నా బహిరంగ మార్కెట్లో రూ.100 కోట్ల పైన ఉంటుందని చెబుతున్నారు. కర్మన్ ఘాట్ లో 2.63 కోట్ల విలువైన రెండు రెసిడెన్షియల్ ప్లాట్లు, రూ.1.61 కోట్ల విలువైన జీ ప్లస్ 3 పెంట్ హౌస్ ఉన్నట్లు గుర్తించారు. దాంతో పాటు యాచారం మండలం నల్లవెల్లి గ్రామంలో రూ.25.25 లక్షల విలువ చేసే పది ఎకరాల వ్యవసాయ భూమి, నగర శివార్లలో 63.84 లక్షల విలువ చేసే ఎనిమిది ఖాళీ స్థలాలు, బాలాపూర్ లోని నరేంద్ర బార్ అండ్ రెస్టారెంట్ లో రూ.86 లక్షల పెట్టుబడులు, రూ.4 లక్షల నగదు, బ్యాంకు ఖాతాల్లో రూ.8.60 లక్షలు, 680 గ్రాముల బంగారం, రూ.59 లక్షల విలువైన మూడు కార్లు, రెండు బైకులు స్వాధీనం చేసుకున్నారు. శ్రీనివాస్ రెడ్డి గతంలో మహేశ్వరం, బాలాపూర్, శంషాబాద్ తదితర ప్రాంతాలలో తహసీల్దార్ గా పనిచేశారని, మహేశ్వరం మండలంలో పనిచేస్తున్న సమయంలో 2009లో అవినీతి నిరోధక చట్టం కింద ఒక కేసు నమోదయిందని సమాచారం. తాజా దాడుల అనంతరం నిందితుడిని అదుపులోకి తీసుకుని ఏసీబీ ప్రత్యేక కోర్టులో హాజరు పరిచిన అనంతరం రిమాండ్ తరలించారు.

# ఎన్టీఆర్' ఇమేజ్ పోగొట్టుకున్న వైసీపీ..!




టీడీపీ వ్యవస్థాపక అధ్యక్షుడు, దివంగత ఎన్టీఆర్ పేరును వినియోగించుకునే విషయంలో వైసీపీ గత పాలనలో ముందున్న విషయం తెలిసిందే. ఏకంగా కృష్ణా జిల్లాను విడదీసి.. ఎన్టీఆర్ పేరు పెట్టారు. దీంతో ఒక జిల్లాకు ఎన్టీఆర్ పేరు పెట్టిన ఘనత తమ దేనని ప్రకటించుకున్నారు. తర్వాత.. ఆయన పేరుతో పాలిటిక్స్ చేయాలని అనుకున్నారు. ఎన్టీఆర్ సామాజిక వర్గాన్ని ఆకర్షించే ప్రయత్నం చేశారు. కానీ, ఇదేసమయంలో హెల్త్ యూనివర్సిటీకి ఎన్టీఆర్ పేరు తీసేయడం.. వచ్చిన ఇమేజ్‌ను పోగొట్టిందన్న వాదన ఉంది. ూశ్రీంశీ =ఖుం – విజయ్ వెనక్కి తగ్గాల్సిందేనా.. దళపతిని ఇరకాటంలో నెట్టేసిన డీఎంకే కట్ చేస్తే.. ఎన్టీఆర్ జిల్లాలో వైసీపీ పాలిటిక్స్ ఒక అడుగు ముందుకు పది అడుగులు వెనక్కి అన్నచందం గా ఉన్నాయని పరిశీలకులు చెబుతున్నారు. ప్రతి జిల్లాలోనూ వైసీపీ నాయకులు ఉన్నారు. వారిలో ఒకరి ద్దరు జిల్లాలో బలమైన నాయకులుగా ఎదిగారు. ఉదాహరణకు కృష్ణా జిల్లాలో పేర్ని నాని, కొడాలి నాని ఫైర్ బ్రాండ్స్‌గా ఉన్నారు. ఇలా చూసుకుంటే.. ఎన్టీఆర్ జిల్లాలో జోగి రమేష్ కొంత మేరకు ఫైర్ బ్రాండ్‌గా గుర్తింపు కోసం ప్రయత్నించినా.. ఆయన కేసుల్లో చిక్కుకుని బయటకు రాలేని పరిస్థితి ఏర్పడింది. ఇక, మిగిలిన నాయకుల్లో సామినేని ఉదయబాను జనసేనలోకి వెళ్లిపోయారు. నందిగామ మాజీ ఎమ్మెల్యే మొండితోక జగన్మోహన్‌రావు ఈ గ్యాప్ ఫిల్ చేయాలని అనుకున్నప్పటికీ.. సాధ్యం కాలేదు. ఇక, విజయవాడలోనూ బలమైన నాయకులు లేకుండా పోయారు. గతంలో మల్లాది విష్ణు ఉన్నా.. ఆయన పరిస్థితి ఇరకాటంలో పడింది. మాజీ మంత్రి వెల్లంపల్లి శ్రీనివాసరావు అంతర్గత కుమ్ములాటలతో ఇబ్బంది పడుతున్నారు. దీంతో ఎన్టీఆర్ జిల్లాలోని ఏడు నియోజకవర్గాల్లో వైసీపీకి బలమైన నాయకులు కరువయ్యారు. కీలకమైన ఎంపీ పోస్టు ఖాళీగానే ఉంది. ఎంపీ అభ్యర్థిని ఇప్పటి వరకు ఎంపిక చేయకపోవడంతో వైసీపీ తరఫున వాయిస్ వినిపించే బలమైన వారు కనిపించడం లేదన్నది వాస్తవం. మరోవైపు కొన్ని నియోజకవర్గాల్లో టీడీపీలో అంతర్గత పోరు జరుగుతోందని.. అది తమకు లాభిస్తుందని వైసీపీ వేసుకున్న అంచనాలు కూడా తలకిందులు అయ్యాయి. పార్టీ పరంగా తీసుకున్న చర్యలతో తమ్ముళ్లు సర్దుకుపోతున్నారు. దీంతో ఎన్టీఆర్ పేరు పెట్టుకున్నా.. జిల్లాలో వైసీపీ పెద్దగా పుంజుకోలేక పోవడం.. ఏడు నియోజకవర్గాల్లో నూ కూటమి బలంగా ఉ ఒడడం గమనార్హం.

# యనమల వర్సెస్ కేఈ : గవర్నర్ పదవి ఎవరికి ?




వైసీపీ సీనియర్ నాయకులు, మాజీ మంత్రులు యనమల రామక్రిష్ణుడు, కేఈ క్రిష్ణ మూర్తిలలో ఒకరికి రాజయోగం రాజ్ భవన్ యోగం పట్టనుంది అని అంటున్నారు. ఈ ఇద్దరూ 1983 నుంచి టీడీపీలో ఉన్నారు. ఎన్నో సార్లు ఎమ్మెల్యేగా అలాగే మంత్రిగా పనిచేసిన వారు. యనమల అయితే స్పీకర్ గా కూడా తనదైన శైలిలో సేవలు అందించారు. గోదావరి జిల్లాకు చెందిన యనమలకు అదే విధంగా రాయలసీమకు చెందిన కేఈ క్రిష్ణమూర్తి ఇద్దరూ చంద్రబాబుకు మంచి స్నేహితులు, సన్నిహితులు, టీడీపీలోనే వారు కొనసాగుతూ వచ్చారు. ఇక యనమల అయితే గత ఏడాది ఎమ్మెల్సీ పదవీకాలం ముగియడంతో మాజీ అయిపోయారు. కేఈ 2019 తరువాత ఎన్నికల్లో పోటీ చేయలేదు. ఈ ఇద్దరి సీనియర్ల విషయంలో తగిన న్యాయం చేయాలని టీడీపీ అధినేత చంద్రబాబుకు ఉందని అంటున్నారు. ఇక ఏపీలో టీడీపీ నుంచి ఏకంగా 17 మంది ఎంపీలు కేంద్రంలో బీజేపీకి మద్దతు ఇస్తున్నారు. దాంతో పాటుగా క్లిష్ట సమయంలో సహకరిస్తున్నారు. దాంతో టీడీపీ పట్ల బీజేపీ పెద్దలకు సానుకూల అభిప్రాయం ఎంతగానో ఉంది అని అంటున్నారు. ఆ మధ్య చంద్రబాబు ఢిల్లీకి వెళ్ళినపుడు కేంద్ర పెద్దలను కలసి తమకు ఒక గవర్నర్ పోస్టు కావాలని కోరారని చెబుతున్నారు. దానికి కేంద్రం కూడా అంగీకరించింది అని అంటున్నారు. తొందరలోనే అర డజన్ కి పైగా గవర్నర్ల పదవులు ఖాళీ అవుతున్నాయి. అందులో కచ్చితంగా టీడీపీకి ఒక పోస్టు ఇస్తారని అంటున్నారు. ఇక తెలుగుదేశం పార్టీకి ఇప్పటికే ఒక గవర్నర్ పోస్టుని బీజేపీ కేటాయించింది. విజయనగరం జిల్లాకు చెందిన పూసపాటి అశోక్ గజపతిరాజుని గోవా గవర్నర్ గా నియమించారు. రెండవ పోస్టు తొందరలో రాబోతోంది అని అంటున్నారు. మరి ఈ పోస్టు ఎవరికి ఎవరికి చాన్స్ ఎక్కువగా ఉంది అంటే బాబు మదిలో కేఈ క్రిష్ణమూర్తి యనమల రామక్రిష్ణుడు మెదులుతున్నారు అని అంటున్నారు. ఈ ఇద్దరూ పార్టీకి చేసిన సేవలకు గుర్తుగా వారికి గౌరవప్రదమైన గవర్నర్ పదవిని ఇవ్వడం ద్వారా న్యాయం చేసినట్లు అవుతుంది అని అంటున్నారు. కేఈ క్రిష్ణమూర్తికి రాయలసీమలో మంచి పట్టు ఉంది. ఆయన బీసీ నేతగా బలమైన పాత్ర పోషిస్తూ వస్తున్నారు. ఆయన తమ్ముడు కుమారుడు రాజకీయ వారసులుగా ఉన్నారు, అయితే కేఈకి తగిన గౌరవం ఇస్తేనే సీమలో ప్రత్యేకించి ఉమ్మడి కర్నూలు జిల్లాలో పార్టీకి సానుకూలం అవుతుందని అంటున్నారు. బీసీ సామాజిక వర్గానికి చెందిన నాయకుడు కావడంతో బీసీ పార్టీగా టీడీపీకి అది క్రెడిట్ గా ఉంటుందని అంటున్నారు. మరో వైపు యనమల విషయం తీసుకున్నా ప్రముఖ బీసీ నేతగా ఉన్నారు. ఆయనకు ఈ పదవి ఇచ్చినా పార్టీకి మేలు జరుగుతుంది అని అంటున్నారు. యనమల అయితే రాజ్యసభ సీటు మీద ఆశ పడుతున్నారు అని అంటున్నారు. ఆయనకు రాజ్ భవన్ దారి చూపించాలన్నది టీడీపీ అధినాయకత్వం ఆలోచనగా ఉంది. మొత్తానికి సామాజిక న్యాయం చేయాలన్నది టీడీపీ సిద్ధాంతం. అంతే కాకుండా సమర్థులకు తగిన పదవులు ఇవ్వాలని కూడా చూస్తోంది. ఈ నేపథ్యంలో యనమల అయినా కేఈ అయినా కచ్చితంగా గవర్నర్ పదవిలో ఎవరో ఒకరు కూర్చునే అవకాశం ఉంది అని అంటున్నారు.

## డీలిమిటేషన్‌పై ప్రత్యేక పార్లమెంట్ సమావేశాలు ?




మహిళా రిజర్వేషన్, డీలిమిటేషన్ బిల్లు విషయంలో కేంద్రం ఏం చేయనుందన్న అంశంపై ప్రస్తుతం ఉత్కంఠ నెలకొంది. ఈ వర్షాకాల సమావేశాల్లోనే బిల్లు పెడతారన్న అంచనాలు మొదట్లో వెలువడినా పేపర్ లీక్ అంశం వివాదాస్పదం కావడంతో డీలిమిటేషన్ అంశం తెరమరుగైనట్టు కనిపించింది. అయితే, డీలిమిటేషన్ కోసం కేంద్రం ప్రత్యేక పార్లమెంటు సమావేశాలు నిర్వహించే అవకాశం ఉందన్న అంచనాలు ప్రస్తుతం వెలువడుతున్నాయి. నిన్న దక్షిణాది రాష్ట్రాల ముఖ్యమంత్రుల సమావేశంలో అమిత్ షా నియోజకవర్గ పునర్విభజన అంశాన్ని ప్రస్తావించారు. డీలిమిటేషన్‌ను మొదటి నుంచీ వ్యతిరేకిస్తున్న తమిళనాడు సీఎం ఈ సమావేశం తరువాత మెత్తబడినట్టు ప్రచారం మొదలైంది. సమావేశం అనంతరం విజయ్ కీలక వ్యాఖ్యలు చేశారు. ప్రస్తుత పార్లమెంటరీ ప్రాతినిధ్యంలో రాష్ట్రాల వాటా తగ్గకుండా రక్షణ కల్పించాలని అన్నారు. ఈ దిశగా కేంద్రం స్పష్టమైన హామీ ఇవ్వాలని అన్నారు. ఇక దక్షిణాది వాటా తగ్గకుండా ఉంటే డీలిమిటేషన్ బిల్లును వ్యతిరేకించాల్సిన అవసరం లేదనే అభిప్రాయంలో డీఎంకే కూడా ఉన్నట్టు తెలుస్తోంది. ఇటీవలి వర్షాకాల పార్లమెంట్ సమావేశాలు ఆగస్టు 13వ తేదీ వరకు జరిగిన విషయం తెలిసిందే. ఆ తరువాత సభను ప్రోరోగ్ చేయాల్సి ఉండగా ఇప్పటివరకూ ఆ దిశగా ఎలాంటి చర్య లేకపోవడంతో కేంద్రం ఏ నిర్ణయం తీసుకుంటుందో అన్న ఉత్కంఠ పెరిగింది.

## ప్రియాంక కేసులో ముగిసిన నిందితుల కస్టడీ




రాజమహేంద్రవరం, : డాక్టర్ ప్రియాంక మృతి కేసులో నిందితుల పోలీస్ కస్టడీ ముగిసింది. కోర్టు అనుమతితో సురవరపు దిశ్వంత్, దేశభక్తుల ఆండ్రూ జోసెఫ్ ఎడ్వర్డ్‌ను 19న ఉదయం 11 గంటలకు తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరం సెంట్రల్ జైలు నుంచి పోలీసులు తీసుకెళ్లారు. దర్యాప్తు అధికారి, అడిషనల్ ఎస్పీ పాటిల్ దేవరాజ్ మనీశ్ వారిని విచారించారు. 20న సీన్ రీకన్‌స్ట్రక్షన్ చేశారు. 21న ఉదయం 11 గంటల వరకూ మాత్రమే కోర్టు అనుమతి ఉండటంతో నిందితులను జైలుకు తరలించారు. ఇప్పటికే దర్యాప్తు అధికారి కీలక సమాచారం రాబట్టినట్టు తెలుస్తోంది. నిందితులను మరొకసారి కస్టడీకి తీసుకొనే అవకాశం ఉంది. ఈ ఘటనపై ప్రకాశం నగర్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేశారు. ఈ స్టేషన్ సెంట్రల్ జోన్ పరిధిలోకి వస్తుంది. అయితే ఆరోపణల నేపథ్యంలో ఆ డీఎస్పీని పక్కనబెట్టి డీఎస్పీ శివప్రియను ఐవోకు సహాయ అధికారిగా నియమించారు. ఇదిలా ఉండగా, ప్రమాదం జరిగిన తర్వాత కేవలం మూడు గంటల్లోనే ఎఫ్ఐఆర్ వేశామని.. వేగంగా స్పందించామని పోలీసులు చెబుతున్నారు. అయితే అప్పటికప్పుడు అర్ధరాత్రి వేళ హడావుడిగా హిట్ అండ్ రన్ కేసు నమోదు చేయడం వెనుక నిందితులను ఉద్దేశపూర్వకంగా రక్షించే గూడుపుఠాణి ఉందనే చర్చ నడుస్తోంది. ఘటన 10 గంటల ప్రాంతంలో పోలీసుల దృష్టికి వెళ్లగా అర్ధరాత్రి 1 గంట సమయంలో ఎఫ్ఐఆర్ నమోదు చేయడంపై సందేహాలు వ్యక్తమవుతున్నాయి.

## సర్కారు బడి తనిఖీకి వెళ్లిన సీజేపీ బృందంపై దాడి



జైపూర్, ఆగస్టు 21: రాజస్థాన్‌లోని జైపూర్‌లో సర్కార్ బడి తనిఖీ చేయడానికి వెళ్లిన కాక్రోచ్ జనతా పార్టీ(సీజేపీ) బృందంపై శుక్రవారం తీవ్రస్థాయిలో దాడి జరిగింది. 'స్కూల్ ఠీక్ కరో' కార్యక్రమంలో భాగంగా సీజేపీ కో-కన్వీనర్ అశుతోష్ రంకా నేతృత్వంలోని ప్రతినిధుల బృందం.. రాంపురా కన్వార్‌పురా గ్రామంలో బడుల స్థితిగతులను పరిశీలించేందుకు వెళ్లింది. సీజేపీ ప్రతినిధులు గ్రామానికి చేరుకోగానే.. స్థానికులు, బీజేపీ కార్యకర్తలు చుట్టుముట్టి రాళ్లతో, కర్రలతో విరుచుకు పడ్డారని అశుతోష్ ఆరోపించారు. పాఠశాల భవనం ప్రమాదకరంగా ఉందనే కారణంతో, గత కొన్నేళ్లుగా విద్యార్థులకు సమీపంలోని ఓ పశువుల కొట్టంలో తరగతులు నిర్వహిస్తున్నారని.. దీనిని ప్రశ్నించినందుకు తమపై దాడి చేయించారని ధ్వజమెత్తారు. తమ సభ్యులపై దాడి చేసి చొక్కాలు చింపేశారని, వాహనాల అద్దాలు, మొబైల్ ఫోన్లు ధ్వంసం చేశారని.. మహిళా ప్రతినిధులపై బురద చల్లి దుర్భాషలాడారని వాపోయారు. ఈ ఘర్షణల్లో పలువురు సభ్యులకు తీవ్ర గాయాలయ్యాయని, ఒకరి చెయ్యి కూడా విరిగిందని పేర్కొన్నారు. రాజస్థాన్ విద్యాశాఖమంత్రి మదన్ దిలావర్ ఆదేశాల మేరకే.. బీజేపీ గుండాలు తమపై దాడి చేశారని సీజేపీ వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే ఆగ్రహం వ్యక్తం చేశారు. పశువుల పాకలో నడుస్తున్న బడిని బాగుచేయాలని కోరడమే తమ ప్రతినిధులు చేసిన నేరమా? అని నిలదీశారు. బాధ్యులైన వారిని 48గంటల్లో అరెస్ట్ చేయాలని లేదంటే తమ నిరసనలు తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు.

# కన్నుమూసిన కలం

### వాస్తవ వార్తలకు ఇక ఎవరు సాక్ష్యం?
### నిజాయితీ, నిర్భయ జర్నలిజానికి నిదర్శనం దేవులపల్లి రామలింగేశ్వర శర్మ



రాజమహేంద్రవరం కిర్లంపూడి: ఆగస్టు 21 జి ఎస్ బి వార్త : నిజాన్ని నిర్భయంగా రాసే కలం కనుమరుగైంది. జర్నలిజం నైతిక విలువలకు కట్టుబడి, వాస్తవ ఘటనలను ప్రజల ముందుకు తీసుకువచ్చిన ప్రముఖ పాత్రికేయుడు, దేవులపల్లి రామలింగేశ్వర రావు ఈయన వార్త దినపత్రికలో బ్యూరో ఇన్చార్జిగా పనిచేయడంగా జరిగింది. అనంతరంవెలుగు దినపత్రిక వ్యవస్థాపకులు గా దేవులపల్లి రామలింగేశ్వర శర్మ పని చేయడం జరిగింది ఈయన ఇక మన మధ్య లేకపోవడం పత్రికా రంగానికి తీరని లోటుగా పలువురు పాత్రికేయులు, పాఠకులు అభివర్ణిస్తున్నారు. రాజమహేంద్రవరంలో వెలుగు దినపత్రికను స్థాపించి, సంపాదకుడిగా జర్నలిస్టుగా ఆయన అందించిన సేవలు చిరస్మరణీయమని పేర్కొంటున్నారు వార్త అంటే కేవలం ప్రచురణ కాదని, వాస్తవాన్ని నిర్భయంగా ప్రజల ముందుంచడమే నిజమైన జర్నలిజమని తన కలం ద్వారా ఆయన నిరూపించారని పలువురు గుర్తుచేసుకుంటున్నారు. డబ్బుకు కాదు.. వాస్తవానికి ప్రాధాన్యం అన్న సూత్రంతో ఆయన పనిచేశారని, ఏ శాఖలో తప్పు జరిగినా ఏ ప్రభుత్వం అధికారంలో ఉన్నా వాస్తవాన్ని వాస్తవంగానే రాసేవారని పాత్రికేయులు చెబుతున్నారు. ఆయన కలం కదిలితే సంబంధిత వ్యక్తుల్లో బాధ్యతాభావం భయం కలిగేంత పదునుగా ఆయన వార్తలు ఉండేవని పాత తరం పాత్రికేయులు, పాఠకులు గుర్తుచేసుకుంటున్నారు. రాజ్యాంగం కల్పించిన హక్కులను గౌరవిస్తూ, పాత్రికేయ వృత్తి పట్ల తన బాధ్యతను నిబద్ధతతో నిర్వర్తించిన వ్యక్తిగా రామలింగేశ్వర శర్మకు ప్రత్యేక గుర్తింపు ఉందని పలువురు పేర్కొంటున్నారు. చిన్నవారినైనా ఆప్యాయంగా పలకరిస్తూ, ప్రతి ఒక్కరినీ గౌరవించే పెద్దమనసు ఆయన సొంతమని ఆయనతో అనుబంధం ఉన్నవారు స్మరించుకుంటున్నారు. ఇటీవల అనారోగ్యంతో కాకినాడలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఆయన మృతి చెందడంతో పాత్రికేయ లోకం తీవ్ర దిగ్భ్రాంతికి గురైంది. ఆయన అంత్యక్రియలు తన సొంత ఊరు జగ్గంపేట నియోజకవర్గం కిర్లంపూడి మండలంలో జరిగింది అంతిమ కార్యక్రమానికి పెద్ద సంఖ్యలో పాత్రికేయులు, పాఠకులు, అభిమానులు హాజరై కన్నీటి నివాళులు అర్పించారు. ఆయన మృతిపై రాష్ట్ర ముఖ్యమంత్రులు ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సైతం సంతాపం వ్యక్తం చేయడం, పత్రికా రంగానికి ఆయన అందించిన సేవలకు ఉన్న గుర్తింపును తెలియజేస్తుందని పలువురు పేర్కొన్నారు నిజాన్ని ప్రశ్నించడంలో వెనకడుగు వేయని, ప్రజల సమస్యలకు అక్షరరూపం ఇచ్చిన తన జీవితాన్ని పూర్తిగా పత్రికా రంగానికి అంకితం చేసిన రామలింగేశ్వర శర్మను కోల్పోవడం జర్నలిజానికి తీరని లోటని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నాలుగో స్తంభంగా భావించే పత్రికా రంగానికి ఆయన చేసిన సేవలు ఎప్పటికీ మరువలేనివని, ఆయన కలం ఆగిపోయినా.. ఆయన రాసిన అక్షరాలు, చూపిన జర్నలిజం మార్గం మాత్రం సజీవంగానే ఉంటుందని పాత్రికేయులు, పాఠకులు స్మరించుకుంటున్నారు కన్నుమూసిన కలం.. కానీ వాస్తవం కోసం పోరాడిన ఆ కలం జ్ఞాపకాలు మాత్రం చిరస్థాయిగా నిలిచిపోతాయి..... ఆయన మృతి పట్ల పాత్రికేయులు తరుపున ప్రగాఢ సానుభూతి తెలియజేస్తూ ఆయన కుటుంబ సభ్యులకు మనోధైరాయిని నింపాలని ఆ భగవంతుని ప్రార్థిస్తున్నా సందర్భంగా ఏర్పడింది....

## విద్యుత్ సబ్‌స్టేషన్ నుంచి బాలూర వసతి గృహం వరకు చీకటిమయం

### విద్యుత్ దీపాలు లేక ప్రజలకు తీవ్ర ఇబ్బందులు



గోకవరం ఆగస్టు 21 జి ఎస్ బి వార్త : గోకవరం సంజీవయ్య నగర్కు వెళ్లే మార్గంలో విద్యుత్ సబ్‌స్టేషన్ నుంచి బాలూరి వసతి గృహం వరకు ఉన్న ప్రాంతం రాత్రివేళల్లో చీకటిమయంగా మారుతోంది విద్యుత్ దీపాలు లేకపోవడంతో ఉద్యోగాలు పనులు ముగించుకుని ఇళ్లకు వెళ్లే మహిళలు, స్థానిక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. చీకటి కారణంగా ఆ ప్రాంతంలో విషసర్పాలు సంచరిస్తున్నట్లు స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దీంతో రాత్రివేళల్లో రాకపోకలు సాగించేందుకు ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. ప్రజల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని పంచాయతీ అధికారులు వెంటనే స్పందించి సబ్‌స్టేషన్ నుంచి బాలూర వసతి గృహం వరకు విద్యుత్ దీపాలు ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు. వెంటనే చర్యలు తీసుకుని ఆ ప్రాంతంలో చీకటిని తొలగించి ప్రజలకు వెలుగులు అందించాలని విజ్ఞప్తి చేస్తున్నారు.....

## నూతన గృహప్రవేశం చేసినజ్యోతుల నెహ్రూ మణి దంపతులు



జగ్గంపేటఆగస్టు 21 జి ఎస్ బి వార్త : కాకినాడలో నూతన గృహప్రవేశ కార్యక్రమం నిర్వహించిన టిటిడి బోర్డు సభ్యులు, టిడిపి పొలిట్ బ్యూరో సభ్యులు, జగ్గంపేట ఎమ్మెల్యేజ్యోతుల నెహ్రూ గారు శ్రీమతి మణి గారు దంపతులు, ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా మాజీ జడ్పీ చైర్మన్ కాకినాడ జిల్లా టిడిపి అధ్యక్షులు శ్రీ జ్యోతుల నవీన్ గారు లక్ష్మీదేవి గారు దంపతులు, మా నవ యువ నాయకుడు జ్యోతుల అనీష్ నెహ్రూ గారు పాల్గొని పాలు పొంగించారు.

## కోనసీమ తిరుమల వాడపల్లి శ్రీ వేంకటేశ్వర స్వామి వారి పవిత్రోత్సవములు




ఆత్రేయపురం ( జీఎస్ బి వార్త) ఆగస్టు 21: కోనసీమ తిరుమల వాడపల్లి శ్రీదేవి భూదేవి సమేత శ్రీ వేంకటేశ్వర స్వామి వారి పవిత్రోత్సవములు 22-08-2026 శనివారం నుండి 24-08-2026 సోమవారం వరకు శ్రీ స్వామివారి ఆలయంలో 3 రోజుల పాటు ఘనంగా నిర్వహించనున్నారు.

గమనిక: పవిత్రోత్సవముల సందర్భంగా 22, 23, 24 తేదీలలో శ్రీ స్వామివారి ఆలయంలో అష్టోత్తర నామార్చన పూజలు, కల్యాణములు, ఉపనయనములు, వివాహములు నిర్వహించబడవు. భక్తులు ఈ విషయాన్ని గమనించగలరు.

## సత్యదేవున్ని దర్శించిన రాష్ట్ర రవాణా శాఖ మంత్రి రాంప్రసాద్ రెడ్డి



అన్నవరం, (జి ఎస్ బి వార్త),ఆగష్టు - 21 : శ్రీ వీర వేంకట సత్యనారాయణ స్వామివారి ఆలయానికి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రవాణా శాఖా మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి శుక్రవారం ఉదయం విచ్చేసారు. రత్నగిరిపై ఆయనకు దేవస్థాన అధికారులు ఆలయ మర్యాదలతో పూర్ణకుంభ స్వాగతం పలికారు. ఈసందర్భంగా ఆయన స్వామివారిని దర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆస్థాన వేధ పండితులు ఆశీర్వచనం గావించి వేధాశీస్సులు అందజేశారు. దేవస్థానం ఏఈఓ పాలంకి జగ్గారావు స్వామివారి శేషవస్త్రం, ప్రసాదం, ఫొటో అందజేశారు. ఈ కార్యక్రమంలో రవాణా శాఖ అధికారులు,దేవస్థానం పిఆర్వో పాలంకి జగ్గారావు,ఆలయ విభాగం అధికారులు వర్రే బాబూరావు తదితరులు పాల్గొన్నారు. మంత్రికి అన్నవరం అదనపు ఎస్ఐ లాలం ప్రసాద్ బందోబస్త నిర్వహించారు.

## సత్యదేవుని సన్నిధిలో రాష్ట్ర ఎక్సైజ్ శాఖా మంత్రి కొల్లు రవీంద్ర

### స్వాగతం పలికిన దేవస్థానం ఈఓ



అన్నవరం, (జి ఎస్ బి వార్త),ఆగష్టు - 21 : శ్రీ వీర వేంకట సత్యనారాయణ స్వామివారి ఆలయానికి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎక్సైజ్ శాఖా మంత్రి కొల్లు రవీంద్ర శుక్రవారం విచ్చేసారు. రత్నగిరిపై ఆయనకు దేవస్థానం ఈఓ ఎన్ సూర్య చక్రధరరావు ఆలయ మర్యాదలతో పూర్ణకుంభ స్వాగతం పలికారు. ఈసందర్భంగా ఆయన స్వామివారిని దర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆస్థాన వేధ పండితులు ఆశీర్వచనం గావించి వేధాశీస్సులు అందజేశారు. ఈఓ స్వామివారి శేషవస్త్రం, ప్రసాదం, ఫొటో అందజేశారు. సత్యదేవుని ఆలయం ఎంతో మహిమగల ఆధ్యాత్మిక క్షేత్రమని, కోరిన కోర్కెలు సిద్ధిస్తాయని, దేవస్థానంలో పనిచేసే సిబ్బంది ఎంతో అదృష్టవంతులని, నిత్యం స్వామి సన్నిధిలో సేవ చేసుకునే భాగ్యం వారి పూర్వజన్మ సుకృతమని మంత్రి కొల్లు రవీంద్ర పేర్కొన్నారు. అనంతరం ఆయన రత్నగిరిపై గల సప్తగోకులంలో ప్రదక్షిణలు చేసి,గోవులను పూజించారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం ఏఈఓ పాలంకి జగ్గారావు,సూపరింటెండెంట్ పర్చూరి కృష్ణ ప్రసాద్, ఆలయ విభాగం అధికారులు, తదితరులు పాల్గొన్నారు. మంత్రికి అన్నవరం అదనపు ఎస్ఐ లాలం ప్రసాద్ బందోబస్త నిర్వహించారు.

## దళితపేటలో సమస్యలు పరిష్కరించండి



పెద్దాపురం, ఆగస్టు 21, జి ఎస్ బి వార్త : దళిత ప్రాంతాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను తక్షణం పరిష్కరించాలని సిఐటియు రాష్ట్ర అధ్యక్షులు ఏవి నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. ప్రజా సంఘాల ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా జరుగుతున్న సామాజిక శంఖారావంలో భాగంగా పెద్దాపురం మండలం బి తాటిపర్తి గ్రామంలో సర్వే నిర్వహించారు. ఈ సర్వేలో అనేక సమస్యలు ఉన్నాయని ప్రాంత ప్రజలు సర్వే బృందానికి వివరించారు. దళితులకు కమ్యూనిటీ భవనం నిర్మించాలని, ఇళ్ల స్థలాలు లేని వారికి ఇళ్ల స్థలాలు ఇవ్వాలని, అనేకమంది పెన్షన్ కోసం ఎదురు చూస్తున్నారని, వారికి పెన్షన్ ఇప్పించాలని, ఉపాది హామీ కార్డులు గ్రామంలో పూర్తిగా ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఏవి నాగేశ్వరరావు మాట్లాడుతూ రాష్ట్రంలో దళితులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. దళిత ప్రాంతాల్లో సమస్యలు పరిష్కారం కోసం ఆగస్టు 24వ తేదీన అన్ని కలెక్టరేట్ల వద్దా జరిగే ధర్నాలో పాల్గొవాలని కోరారు. ఈ సర్వేలో నాయకులు నేలపాల సూరిబాబు, కేదారి నాగు, మాగాపు నాగు, రొంగల వీర్రాజు, దారపురెడ్డి సత్యనారాయణ, శ్రీను, సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

## వనదుర్గమ్మ ఆలయంలో వైభవంగా "ఖడ్గమాల" పూజలు

### అమ్మవారికి ఘనంగా చండీ హోమం



అన్నవరం, (జి ఎస్ బి వార్త),ఆగష్టు - 21 : కాకినాడ జిల్లా ప్రముఖ పుణ్యక్షేత్రమైన అన్నవరం రత్నగిరి కొండపై వనదేవతగా పూజలందుకుంటున్న వనదుర్గమ్మవారి ఆలయంలో శ్రావణ శుక్రవారం సందర్భంగా "ఖడ్గమాల పూజలు,చండీహోమం" అత్యంత వైభవంగా నిర్వహించారు. నూతన ఆర్జిత సేవగా ప్రారంభమైన ఖడ్గమాల పూజలు ఉదయం 7.30 నుండి 8.30 వరకూ నిర్వహించారు. 1116/- రూపాయల టిక్కెట్ రుసుముతో పలువురు భక్తులు ఖడ్గమాల పూజలలో పాల్గొన్నారు. పూజలు అనంతరం వారందరికీ అమ్మవారి రాగి రూపు,కంకణం,అమ్మవారి కుంకుమ,శేషవస్త్రం, 250 గ్రాముల పులిహోర ప్రసాదంగా అందజేశారు. అనంతరం ఉదయం 9 గంటలకు అమ్మవారికి చండీహోమం ప్రారంభించారు. రూ. 750/- చెల్లించిన భక్తులు చండీహోమంలో పాల్గొన్నారు. ఈసందర్భంగా పండితులు విఘ్నేశ్వర పూజ,పుణ్యాహవాచనం,మండపారాధన,అమ్మవారికి మూల మంత్ర జపములు,సప్తపతి పారాయణములు నిర్వహించారు. హోమం వద్ద విశేష పూజలు అనంతరం ఉదయం 11 గంటలకు అర్చకులు, ఋత్వికులు హోమ గుండంలో పవిత్ర ద్రవ్యాలు సమర్పించి చండీహోమానికి ఘనంగా పూర్ణాహుతి గావించారు. పూజా కార్యక్రమాలను ఆలయ అర్చకులు ప్రయాగ రాంబాబు, వ్రతపురోహితులు మరియు వేదపండితులు,ఋత్విక బృందం తదితరులు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రముఖులు, అధికారులు,సిబ్బంది, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

## బొమ్మూరు కలెక్టరేట్ లో 22న జాబ్ మేళా

### జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి

గోకవరం ఆగస్టు 21 జి ఎస్ బి వార్త బొమ్మూరు కలెక్టరేట్ ప్రాంగణంలోని వికాస కార్యాలయంలో ఈ నెల 22న జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ కీర్తి చేకూరి తెలిపారు. శనివారం ఉదయం 9:30 గంటలకు ఇంటర్వ్యూలు ప్రారంభమవుతాయి. SSC, ఇంటర్, డిగ్రీ, డిప్లొమా, బీటెక్ పూర్తిచేసి 30 ఏళ్ల లోపు ఉన్నవారు అర్హులని పేర్కొన్నారు. నిరుద్యోగ యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ కోరారు.



## నవదుర్గాలయంలో వైభవంగా వ్రత పూజలు...

### పోటెత్తిన మహిళా భక్తులు - భారీగా విందు భోజనాలు





సామర్లకోట, ఆగస్టు 21, జి ఎస్ బి వార్త : సామర్లకోట పట్టణంలోని బడేలమ్మ చెరువు వద్ద గల శ్రీ నవదుర్గ సమేత దుర్గ మల్లేశ్వర స్వామి ఆలయం ముత్తయిదువులతో కిటకిటలాడింది. పెద్దాపురం నియోజకవర్గ పరిధిలో ఎక్కడ జరగని రీతిలో ఈ ఆలయంలో ప్రతి ఏడాది శ్రావణ శుక్రవారం పూజలైన వరలక్ష్మి వ్రత పూజలు ఆలయ కార్య నిర్వహణ అధికారిణి, దేవి పుత్రిక కనక విజయలక్ష్మి ఆధ్వర్యంలో అతి వైభవంగా నిర్వహించడం పరిపాటి. దానిలో భాగంగానే ఈ ఆడది వరలక్ష్మీ వ్రత పూజలను వేలాదిమంది ముత్తైదువులు, మహిళ భక్తుల సమక్షంలో ఉదయం నుంచి సాయంత్రం వరకు ఘనంగా నిర్వహించారు. శుక్రవారం తెల్లవారుజాము నుంచి ఆలయంలోని దుర్గాదేవికి, నవదుర్గలకు పంచామృత అభిషేకాలు శాస్త్రోక్తంగా నిర్వహించి ప్రత్యేకంగా అలంకరించారు. అలాగే ఆలయానికి భారీగా తరలివచ్చిన ముత్తైదువులకు అమ్మ కనక విజయలక్ష్మి ఘనంగా స్వాగతం పలికారు. కొబ్బరికాయ కొట్టి, హారతిలిచ్చి ముత్తైదువులను ఆహ్వానించారు. అనంతరం ఆలయంలో అష్టలక్ష్ములుగా ఎంపిక చేసిన ఎనిమిది మంది ముత్తైదువులను సిద్ధం చేసి వారికి మంగళ స్నానాలు ఆచరింపజేసి, అలంకరించి, వారితో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ఆకట్టుకున్న విందు భోజనాలు : వరలక్ష్మీ వ్రత పూజల సందర్భంగా ఆలయానికి తరలివచ్చిన భక్తులకు ఏర్పాటు చేసిన విందు భోజనాలు భక్తులను ఆకట్టుకున్నాయి. పలు రకాల పిండి వంటలతో పాటు ఆహార పదార్థాలను ప్రత్యేక రీతిలో సిద్ధం చేసి 2026 మంది ముత్తైదువులు, మహిళా భక్తులకు వడ్డించగా వారు ఆనందంతో విందు భోజన కార్యక్రమాల్లో పాల్గొన్నారు. అలాగే వ్రత పూజల్లో భాగంగా ఆలయంలో కోలాటం, సామూహిక కుంకుమ పూజలు, నవదుర్గల పూజలు భక్తులను ఎంతగానో ఆకట్టుకున్నాయి.

316 మందికి అమ్మవారి చీరలు : ఉత్సవాల్లో భాగంగా మధ్యాహ్నం ఆలయంలో 316 మంది ముత్తైదువులకు డ్రా పద్ధతిలో అమ్మవారి చీరలను అందించే కార్యక్రమం కనక విజయలక్ష్మి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ పూజలన్నీ ఆలయ అర్చకులు ఆళ్లక్కి లక్ష్మణ శాస్త్రి ఆధ్వర్యంలో శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఈ పూజల్లో పలువురు ప్రముఖులు, భారీగా భక్తులు పాల్గొన్నారు.

## ఆర్టీసీ డ్రైవర్లు, కండక్టర్లతో కలిసి అల్పాహారం చేసిన మంత్రి మండిపల్లి



అన్నవరం, (జి ఎస్ బి వార్త), ఆగష్టు - 21 : అన్నవరం ఆర్టీసీ కాంప్లెక్స్ లో ప్రయాణికులకు అందుచున్న మౌళిక సదుపాయలను రవాణా శాఖా మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి స్వయంగా పరిశీలించారు. ఆర్టీసీ డ్రైవర్లు, కండక్టర్లు, కార్మికులతో ఆత్మీయంగా మాట్లాడి, వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈసందర్భంగా మంత్రి రాంప్రసాద్ రెడ్డి కాంప్లెక్స్ లోని క్యాంటీన్ ను సందర్శించి పదార్థాల నాణ్యత పరిశీలించారు. ఆర్టీసీ డ్రైవర్లు, కండక్టర్లు, సిబ్బందితో కలసి అల్పాహారం చేసారు. ఏమైనా సమస్యలుంటే నేరుగా తనకు తెలియజేస్తే తక్షణం నివారణా చర్యలు చేపడతానని మంత్రి వారితో పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆర్టీసీ అధికారులు, మనోహర్, శరత్ కుమార్, శర్మ, పి ఎన్ మూర్తి తదితరులు ఉన్నారు.

## గుండెపోటుతో ఆర్టీవి రిపోర్టర్ మృతి...




సామర్లకోట, ఆగస్టు 21, జి ఎస్ బి వార్త : పెద్దాపురం నియోజకవర్గ ఆర్ టివి రిపోర్టర్ గా పనిచేస్తున్న సామర్లకోట పట్టణానికి చెందిన సుబ్రహ్మణ్యం గుండెపోటుతో ఆకస్మికంగా మృతి చెందారు. గురువారం సాయంత్రం పనులన్నీ ముగించుకున్న తర్వాత కుర్చీలో కూర్చుని గుండెపోటు కారణంగా తుది శ్వాస విడిచారు. అప్పటివరకు కుటుంబం అంతటితో ఎంతో సంతోషంగా గడపడంతో పాటు వరలక్ష్మీ వ్రత పూజలకు అవసరమైన పూజ పత్రిని తానే స్వయంగా భార్యకు అందించి కుర్చీలో కూర్చుని సేద దీరుతుండగా గుండెపోటుతో ఆయన మృతి చెందారు. పిలిచినా పలకడం లేదని కుటుంబీకులు అనుమానంతో పరిశీలించగా సుబ్రహ్మణ్యం నిర్జీవంగా ఉన్నట్టు తెలిపారు. దానితో అతనిని స్థానిక ప్రభుత్వాసుపత్రికి తరలించగా అప్పటికే సుబ్రహ్మణ్యం మృతి చెందినట్లు వైద్యులు ధృవీకరించారు. ఈనెల 15వ తేదీనే సుబ్రహ్మణ్యం జన్మదిన వేడుకలను తోటి జర్నలిస్టుల సమక్షంలో సంతోషంతో జరుపుకున్నారు. అది జరిగిన ఐదు రోజుల్లోనే ఆయన మృతి చెందడం అందరినీ కలచివేసింది. సుబ్రహ్మణ్యం కు భార్య ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఆర్ టి వి జర్నలిస్టుగా పనిచేస్తున్న సుబ్రహ్మణ్యం మృతి పట్ల సామర్లకోట కు చెందిన శ్రీ భీమేశ్వర జర్నలిస్ట్ అసోసియేషన్లు, పెద్దాపురం నియోజకవర్గానికి చెందిన తోటి ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులు తీవ్ర సంతాపాన్ని తెలిపారు.

## అన్నవరం ఆర్టీసీ కాంప్లెక్స్ ను ఆకస్మికంగా తనిఖీ చేసిన మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి

అన్నవరం, (జి ఎస్ బి వార్త), ఆగష్టు - 21 : కాకినాడ జిల్లా అన్నవరం ఆర్టీసీ కాంప్లెక్స్ ను రాష్ట్ర రవాణా శాఖా మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి శుక్రవారం ఆకస్మిక తనిఖీ చేపట్టారు. కాంప్లెక్స్ మొత్తం కలియతిరుగుతూ పరిసరాలు పరిశీలించారు. అనంతరం మహిళా ప్రయాణికులతో కాసేపు ముచ్చటించారు. 'స్త్రీ శక్తి' ఉచిత బస్సు ప్రయాణ పథకంపై మహిళా ప్రయాణికుల అభిప్రాయాలు తెలుసుకున్నారు. అన్నవరం కాంప్లెక్స్ లో సౌకర్యాలు, ప్రయాణించే బస్సులలో సీట్లు, ఇతర సౌకర్యాలు పై మంత్రి ఆరా తీయగా,అన్నీ బాగున్నాయని మహిళలు సంతృప్తి వ్యక్తం చేసారు. మీ ఆశీస్సులు మా నాయకుడు మఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు ఎల్లవేళలా ఉండాలని, ఆయన సారథ్యంలో 'స్త్రీ శక్తి' పథకం రాష్ట్ర వ్యాప్తంగా విజయవంతంగా అమలవుతోందని మంత్రి పేర్కొన్నారు. కార్యక్రమంలో డిపీటిఓ మనోహర్, తుని డిపో మేనేజర్ శరత్ బాబు, ఆర్టీసీ శర్మ, అన్నవరం కాంప్లెక్స్ మేనేజర్ పి ఎన్ మూర్తి, తదితర ఆర్టీసీ అధికారులు పాల్గొన్నారు.



వార్త
22-08-2026

# దోషికి కఠిన శిక్ష పడాలి...

### ముస్లిం జేఏసీ కన్వీనర్ ముక్తార్ అలీ డిమాండ్.



పెద్దాపురం, ఆగస్టు 21, జి ఎస్ బి వార్త : పిఠాపురానికి చెందిన పంచాయతీ రాజ్ ఏఈ నూకరాజు కుటుంబం ఆత్మహత్యకు కారణమైన నిందితుడు షేక్ సాదిక్‌పై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని పెద్దాపురం ముస్లిం జాయింట్ యాక్షన్ కమిటీ కన్వీనర్, స్థానిక షాహీ జామియా మసీదు అధ్యక్షుడు ముహమ్మద్ ముక్తార్ అలీ ప్రభుత్వాన్ని, పోలీసు యంత్రాంగాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక షాహీ జామియా మసీదులో జుమ్మా నమాజ్ అనంతరం ఆయన ముస్లిం సమాజాన్ని ఉద్దేశించి మాట్లాడారు. రాజమండ్రిలో నూకరాజు కుటుంబం ఆత్మహత్యకు పాల్పడటం అత్యంత బాధాకరమన్నారు. ఈ ఘటన తమను తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసిందని ఆవేదన వ్యక్తం చేశారు. నూకరాజు కుటుంబ ఆత్మహత్య ఘటనను ముస్లిం సమాజం తీవ్రంగా ఖండిస్తోందన్నారు. బాధిత బాలుడు కార్తికేయ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం నిందితుడు షేక్ సాదిక్ తీవ్ర ఒత్తిడి తేవడం వల్లే ఆ కుటుంబం ప్రాణాలు తీసుకుందని పేర్కొన్నారు. ఇటువంటి చర్యలు తీవ్రమైన నేరంగా మాత్రమే కాకుండా, ఇస్లాం ధర్మానికి పూర్తిగా విరుద్ధమని ఆయన స్పష్టం చేశారు. పరస్త్రీలతో అక్రమ సంబంధాలు గానీ, బలవంతపు మత మార్పిడులు గానీ ఇస్లాంలో పూర్తిగా నిషిద్ధమని ఆయన వెల్లడించారు. మంచిని వ్యాప్తి చేయడం, చెడును అడ్డుకోవడం మాత్రమే నిజమైన జిహాద్ అని అన్నారు. ఒక వ్యక్తి చేసిన తప్పునకు మొత్తం ముస్లిం సమాజాన్ని, ఇస్లాం మతాన్ని నిందిస్తూ సోషల్ మీడియాలో, కొన్ని యూట్యూబ్ ఛానెళ్లలో విద్వేష ప్రచారం చేయడం సరికాదని హితవు పలికారు. నేరం చేసిన వ్యక్తిని నేరస్థుడిగానే చూడాలే తప్ప, మతాన్ని ఆపాదించి సమాజంలో మత చిచ్చు పెట్టే ప్రయత్నాలు చేయవద్దని విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వం, పోలీసులు నిష్పక్షపాతంగా విచారణ జరిపి దోషికి ఉరిశిక్ష లేదా అత్యంత కఠినమైన శిక్ష విధించి బాధిత కుటుంబానికి తగిన న్యాయం చేయాలని కోరారు. ప్రజలందరూ సంయమనం పాటిస్తూ మత సామరస్యాన్ని కాపాడాలని విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో మసీదు కమిటీ ప్రతినిధులు, ముస్లిం పెద్దలు, జేఏసీ సభ్యులు పాల్గొన్నారు.

# జనసేన స్థానిక సంస్థల ఎన్నికలలో కమిటీ లో 14 మంది తో కార్యాచరణ

### ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్

మంగళ గిరి (జిఎస్ బి వార్త) : స్థానిక సంస్థల ఎన్నికల విధి విధానాల రూపకల్పనకు కమిటీ నియామకం – 14 మంది సభ్యులు స్థానిక సంస్థల ఎన్నికలలో జనసేన అనుసరించాల్సిన విధి విధానాలు రూపకల్పనకి ప్రత్యేక కమిటీని పార్టీ అధ్యక్షులు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ శుక్రవారం ప్రకటించారు. ఈ కమిటీలో 14 మంది సభ్యులను నియమించారు. విధి విధానాలతోపాటు క్షేత్ర స్థాయిలో శ్రేణుల ఆలోచనలను ఈ కమిటీ పరిగణనలోకి తీసుకుంటుందని పవన్ కళ్యాణ్ జనసేన శాసన సభ పక్షం సమావేశంలో తెలిపారు.జన సైనికులు, వీర మహిళల పోరాట స్ఫూర్తిని కొనసాగించేలా వారి ఆత్మ గౌరవాన్ని నిలిపేలా స్థానిక సంస్థల ఎన్నికలకు సిద్ధమవుదామని పిలుపునిచ్చారు. ఈ క్రమంలో కమిటీని నియమించారు. కమిటీ సభ్యుల గా మండలి బుద్ధ ప్రసాద్, టి.శివ శంకర్, కందుల దుర్గేష్, వల్లభనేని బాలశౌరి, బొలిశెట్టి శ్రీనివాస్,దేవ వరప్రసాద్, సీహెచ్ వంశీకృష్ణ యాదవ్, లోకం మాధవి,పత్సమట్ల ధర్మరాజు,చిలకం మధుసూదన్ రెడ్డి, కొటికలపూడి గోవిందరావు (చినబాబు), సామినేని ఉదయభాను, యనమల భాస్కర్, కొరికాన రవి కుమార్.

# తంటి కొండ లో పారిశుధ్య లోపం



గోకవరం ఆగస్టు 21జి ఎస్బి వార్త : గోకవరం మండలం తంటికొండ గ్రామంలో పాత సచివాలయం భవనం చుట్టూ తుప్పలు పెరిగి మురుగునీరుతో నిలిచిపోయి దుర్వాసన వస్తుందని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు పంచాయతీ అధికారులు స్పందించి మురుగు నీరుని నిలవకుండా చేయాలని అలాగే తుప్పలు తొలగించి పరిశుభ్రంగా చేయాలని కోరుతున్నారు ఆ ప్రదేశంలో బ్లీచింగ్ పిచికారి చేయాలి లేదంటే సీజనల్ వ్యాధులు బారిన పడే అవకాశం ఉందని చుట్టూ ఉన్న ప్రజలు భయపడుతున్నారు కావున అధికారులు స్పందించి పారిశుద్ధ్య కార్యక్రమాలు చేపట్టాలని గ్రామస్థులు కోరుతున్నారు

# మూడు నియోజకవర్గాల్లో నాలుగు వేల మందికి బంగారు రూపులు పంపిణీ.. "కంబాల"



రాజానగరం (కోరుకొండ) ఆగస్టు 21 (జి ఎస్ బి వార్త ) : మహిళామృతుల హైందవ చైతన్యం తీసుకురావాలనే సంకల్పంతో విశ్వహిందూ ధర్మపరిరక్షణ రామసేన అధ్యక్షులు, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, జగ్గంపేట నియోజకవర్గం బీఎల్‌ఏ–1 కంబాల శ్రీనివాసరావు సంకల్పించిన, బంగారు వరలక్ష్మి కానుక సీజన్–4 (2026) గ్రాండ్ సక్సెస్ అయ్యింది. రాజానగరంలోని మాధవి ఫంక్షన్ హాల్లో శుక్రవారం రాత్రి ముగింపు కార్యక్రమం అత్యంత ఘనంగా జరిగింది. రాజానగరంలో మూడోవ రోజు ఆఖరి నాడు రాజానగరం, శ్రీకృష్ణ పట్నం, పుణ్యక్షేత్రం, మల్లంపూడి, సంపత్ నగర్, రామస్వామి పేట, కొండగుంటూరు, పరిజల్లిపేట, కనావరం , చక్రద్వారబంధం గ్రామాలకు సంబంధించి నిర్వహించిన, లక్కీడ్రాలో గెలిపోందిన 220 మంది మహిళ విజేతలకు బంగారు రూపులు, పట్టు చీరలు, పసుపు కుంకుమలను కంబాల దంపతులు ఉచితంగా పంపిణీ చేసారు. అలాగే 3,500 మంది మహిళలకు పట్టు చీరలు పంపిణీ చేసారు. శ్రావణమాసంలో ప్రతి పేద మహిళకు కూడా పట్టు చీరను అందించాలని ఉద్దేశంతో, గత నెల 11వ తేదీ నుంచి నేలాఖరి వరకు కంబాల కానుక వనితల వేడుక కార్యక్రమం ద్వారా ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలోని 50 గ్రామాల్లో మహిళలకు కంబాల శ్రీనివాసరావు పట్టు చీరలు పంపిణీ చేసారు. ఈ నెల 3 తేదినుంచి బంగారు వరలక్ష్మి కానుక సీజన్–4 కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. గోకవరం, కోరుకొండ, ఇందుకూరుపేట, రాజవొమ్మంగి, అడ్డతీగల, చవిటిదిబ్బలు, రంపచోడవరం, సీతానగరం, రాజానగరం మండలాల పరిధిలో గ్రామాలకు లక్కీడ్రా నిర్వహించి డ్రాలో గెలిపోందిన విజేతలకు బంగారు వరలక్ష్మి రూపులను ఉచితంగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కంబాల శ్రీనివాసరావు మాట్లాడుతూ మహిళల్లో హైందవ చైతన్యం తీసుకురావడం, శ్రావణమాసంలో ప్రతి పేద మహిళ బంగారు రూపుతో వరలక్ష్మి వ్రతం జరుపుకోవాలనే సంకల్పంతో 2023లో బంగారు వరలక్ష్మి కానుక కార్యక్రమానికి రూపకల్పన చేసామన్నారు. ఈ కార్యక్రమం గొప్ప విజయం కావడంతో ఈ ఏడాది సీజన్– 4 ప్రారంభించమన్నారు. 150 మంది సిబ్బందితో ఎక్కడ ఏటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా, పోలీసుల సహకారంతో ప్రతిష్టమైన చర్యలు తీసుకోవడం జరిగిందన్నారు. వచ్చిన ప్రతి వారికి కూడా భోజన రవాణా సౌకర్యం కనిపించడం జరిగిందన్నారు. లక్కీ డ్రాలో బంగారు రూపులు రాని మహిళలు నిరాశ చెందకుండా, ఒట్టి చేతులతో తిరిగి ఇంటికి వెళ్ళకుండా వారందరికీ పట్టుచీరలు, పసుపు కుంకుమను పంపిణీ చేయడం జరిగిందన్నారు. కులమతాలకు అతీతంగా డ్రాలో గెలిపొందిన ముస్లిం, క్రిస్టియన్ మహిళలకు కూడా బంగారు రూపులు పంపిణీ చేయడం జరిగిందన్నారు. నిన్నటి వరకు లక్ష పట్టు చీరలు పంపిణీ చేశామని, అలాగే మూడు మూడు నియోజకవర్గాల పరిధిలో నాలుగు వేల పైగా బంగారు రూపులను ఉచితంగా పంపిణీ చేసామని వెల్లడించారు. ప్రతిచోట కూడా అడుగడుగున, మహిళలు, నాయకులు, కార్యకర్తలు, స్థానిక ప్రజలు, నీరాజనాలు పట్టడం జరిగిందన్నారు. కనకదుర్గ అమ్మవారి ఆశీస్సులతో దిగ్విజయంగా ఈ కార్యక్రమం విజయవంతం అయ్యిందని ఆనందం వ్యక్తం చేశారు. ఇందుకు సహకరించిన నాయకులు, కార్యకర్తలు, మహిళలు, అభిమానులు, పోలీసులకు ప్రతి ఒక్కరికి కంబాల శ్రీనివాసరావు పేరు, పేరున ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

# ఎస్ ఆర్ ఐ -2026పై ఆగస్టు 22, 23 తేదీల్లో ప్రత్యేక ప్రచారం

### పోలింగ్ కేంద్రాల్లో బి ఎల్ ఓ లు, బి ఎల్ ఓ సూపర్వైజర్లు తప్పనిసరిగా అందుబాటులో ఉండాలి

### ఓటర్ల నుంచి ఫారం--6, 7, 8 దరఖాస్తుల స్వీకరణ

### ఏ ఈ ఆర్ ఓ లు, అదనపు ఏ ఈ ఆర్ ఓ లు లు, మండల ప్రత్యేక అధికారులు క్షేత్రస్థాయిలో పర్యవేక్షించాలి

### బి ఎల్ ఓ ల హాజరుపై ప్రత్యేక పర్యవేక్షణ -- గైర్హాజరైతే క్రమశిక్షణ చర్యలు

### - జిల్లా ఎన్నికల అధికారి / జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి

రాజమహేంద్రవరం (జిఎస్ బి వార్త) : భారత ఎన్నికల సంఘం ఆదేశాలు, మార్గదర్శకాల మేరకు ఓటర్ల జాబితా స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్--2026 (SIR-2026) ప్రక్రియలో భాగంగా ఆగస్టు 22, 23 తేదీల్లో జిల్లాలో ప్రత్యేక ప్రచార దినాలు (స్పెషల్ కాంపెయిన్ డేస్ ) నిర్వహిస్తున్నట్లు జిల్లా ఎన్నికల అధికారి, తూర్పు గోదావరి జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎస్ ఆర్ ఐ -2026 ప్రక్రియలో అర్హులైన ప్రతి పౌరుడిని ఓటరుగా నమోదు చేయడం, ఓటర్ల జాబితాలోని వివరాలను పరిశీలించడం, అర్హత కలిగిన వారిని జాబితాలో చేర్చడం, అనర్హులు లేదా మరణించిన వారి వివరాలను నిబంధనల మేరకు పరిశీలించడం, ఓటర్ల వివరాల్లో తప్పులు ఉంటే సరిచేయడం వంటి కార్యక్రమాలు చేపడుతున్నామని తెలిపారు. ఈ ప్రక్రియలో భాగంగా ఓటర్లకు అవసరమైన మార్గదర్శకత్వం అందించేందుకు ప్రత్యేక ప్రచార దినాలను నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. జిల్లాలోని 8 అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలోని అన్ని పోలింగ్ కేంద్రాల్లో ఆగస్టు 22, 23 తేదీల్లో ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు బూత్ స్థాయి అధికారులు (బి ఎల్ ఓలు) తప్పనిసరిగా అందుబాటులో ఉండి ఓటర్ల నుంచి దరఖాస్తులు స్వీకరించాలని ఆదేశించారు. ఫారం--6, 7, 8 దరఖాస్తుల స్వీకరణ కొత్తగా ఓటరుగా నమోదు కావడానికి ఫారం--6, ఓటరు జాబితాలో పేరు, చిరునామా, ఇతర వివరాల్లో మార్పులు, చేర్పులు, చిరునామా మార్పు, ఎపిక్ కు సంబంధించిన మార్పుల కోసం ఫారం--8, ఓటరు జాబితా నుంచి పేరు తొలగింపు లేదా అభ్యంతరాల కోసం ఫారం--7 దరఖాస్తులను స్వీకరించాలని సూచించారు. స్వీకరించిన దరఖాస్తులను నిబంధనల ప్రకారం పరిశీలించి, సంబంధిత ఆన్‌లైన్ ప్రక్రియను ఎలాంటి జాప్యం లేకుండా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. బి ఎల్ ఓ ల హాజరుపై ప్రత్యేక పర్యవేక్షణ ప్రత్యేక ప్రచార దినాల్లో బి ఎల్ ఓ లు తమకు కేటాయించిన పోలింగ్ కేంద్రాల్లో తప్పనిసరిగా విధులు నిర్వహించేలా బి ఎల్ ఓ సూపర్వైజర్లు ప్రత్యేకంగా పర్యవేక్షించాలని కలెక్టర్ ఆదేశించారు. బి ఎల్ ఓ సూపర్వైజర్లు తమ పరిధిలోని పోలింగ్ కేంద్రాలను స్వయంగా తనిఖీ చేసి, బి ఎల్ ఓ ల హాజరు, ఓటర్ల నుంచి దరఖాస్తుల స్వీకరణ, ఓటర్లకు అందిస్తున్న సేవలు, అవసరమైన సమాచారం అందిస్తున్న విధానం తదితర అంశాలను క్షేత్రస్థాయిలో పరిశీలించి సంబంధిత ఉన్నతాధికారులకు నివేదిక సమర్పించాలని సూచించారు. ఏ ఈ ఆర్ ఓ లు, అదనపు ఏ ఈ ఆర్ ఓలు క్షేత్రస్థాయిలో అందుబాటులో ఉండాలి ప్రత్యేక ప్రచార దినాల్లో ఓటర్లకు ఎలాంటి సందేహాలు, సమస్యలు తలెత్తకుండా ఏ ఈ ఆర్ ఓలు (అసిస్టెంట్ ఎలక్టరల్ రిజిస్ట్రేషన్ ఆఫీసర్స్ ), అదనపు ఏ ఈ ఆర్ ఓలు కూడా క్షేత్రస్థాయిలో అందుబాటులో ఉండి అవసరమైన మార్గదర్శకత్వం, పర్యవేక్షణ అందించాలని కలెక్టర్ ఆదేశించారు. దరఖాస్తుల స్వీకరణ, పరిశీలన, సంబంధిత రికార్డుల పరిశీలన, ఆన్‌లైన్ ప్రక్రియ తదితర అంశాల్లో బి ఎల్ ఓలు, బి ఎల్ ఓ సూపర్వైజర్లు, ఏ ఈ ఆర్ ఓలు, అదనపు ఏ ఈ ఆర్ ఓలు పరస్పర సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఓటర్లకు విస్తృత అవగాహన కల్పించాలి ఎస్ ఐ ఆర్ -2026 ప్రక్రియ, ప్రత్యేక ప్రచార దినాల ఉద్దేశ్యం, పోలింగ్ కేంద్రాల్లో అందుబాటులో ఉండే సేవలు, ఫారం--6, 7, 8 వినియోగం తదితర అంశాలపై ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పించాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. అర్హత కలిగిన ప్రతి పౌరుడు ఓటరుగా నమోదు చేసుకోవడం, ఇప్పటికే ఓటరుగా ఉన్న వారు తమ పేరు, చిరునామా, ఇతర వివరాలను పరిశీలించుకోవడం, వివరాల్లో ఏవైనా తప్పులు ఉంటే సంబంధిత ఫారాల ద్వారా సవరణలు చేయించుకోవడం వంటి అంశాలపై గ్రామ, వార్డు స్థాయిలో విస్తృత ప్రచారం నిర్వహించాలని సూచించారు. బి ఎల్ ఓలు తమ పరిధిలోని ఓటర్లకు ఆగస్టు 22, 23 తేదీల్లో నిర్వహించే ప్రత్యేక ప్రచార దినాల సమాచారం చేరేలా చర్యలు తీసుకోవడంతో పాటు, ఓటర్ల సందేహాలను నివృత్తి చేసి అవసరమైన దరఖాస్తులను స్వీకరించాలని పేర్కొన్నారు.

విధులకు గైర్హాజరైతే క్రమశిక్షణ చర్యలు ఆగస్టు 22, 23 తేదీల్లో ముందస్తు అనుమతి లేకుండా విధులకు గైర్హాజరయ్యే బి ఎల్ ఓలు, బి ఎల్ ఓసూపర్వైజర్లపై ఎన్నికల నిబంధనల ప్రకారం కఠినమైన క్రమశిక్షణ చర్యలు తీసుకుంటామని కలెక్టర్ కీర్తి చేకూరి హెచ్చరించారు. ఎన్నికల ప్రక్రియ అత్యంత ప్రాధాన్యత కలిగిన విధి అని, సర్ 2026 ప్రక్రియను సమర్థవంతంగా పూర్తి చేయడంలో ప్రతి ఎన్నికల అధికారి, సిబ్బంది బాధ్యతాయుతంగా వ్యవహరించాలని ఆమె స్పష్టం చేశారు. ప్రత్యేక ప్రచార దినాలను విజయవంతంగా నిర్వహించేందుకు జాయింట్ కలెక్టర్, ఈ ఆర్ ఓ లు, ఏ ఈ ఆర్ ఓలు, అదనపు ఏ ఈ ఆర్ ఓలు, మండల స్థాయి అధికారులు, బి ఎల్ ఓ సూపర్వైజర్లు, బి ఎల్ ఓ లు పరస్పర సమన్వయంతో పనిచేయాలని జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి ఆదేశించారు. సర్ 2026లో భాగంగా అర్హులైన ప్రతి పౌరుడికి ఓటు హక్కు కల్పించడంతో పాటు, ఓటర్ల జాబితా మరింత పారదర్శకంగా, ఖచ్చితంగా ఉండేలా అవసరమైన చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు.

# బంగారు వరలక్ష్మి కానుక-4 గ్రాండ్ సక్సెస్..

### ప్రతి చోట భారీగా తరలివచ్చిన మహిళలు

### లక్ష మందికి పట్టు చీరలు పంపిణీ...

### మూడు నియోజకవర్గాల్లో నాలుగు వేల మందికి బంగారు రూపులు పంపిణీ




గోకవరం ఆగస్టు 21: జి ఎస్ బి వార్త : మహిళామృతుల హైందవ చైతన్యం తీసుకురావాలనే సంకల్పంతో విశ్వహిందూ ధర్మపరిరక్షణ రామసేన అధ్యక్షులు, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, జగ్గంపేట నియోజకవర్గం బీఎల్‌ఏ–1 కంబాల శ్రీనివాసరావు సంకల్పించిన, బంగారు వరలక్ష్మి కానుక సీజన్–4 (2026) గ్రాండ్ సక్సెస్ అయ్యింది. రాజానగరంలోని మాధవి ఫంక్షన్ హాల్లో శుక్రవారం రాత్రి ముగింపు కార్యక్రమం అత్యంత ఘనంగా జరిగింది. రాజానగరంలో మూడోవ రోజు ఆఖరి నాడు రాజానగరం, శ్రీకృష్ణ పట్నం, పుణ్యక్షేత్రం, మల్లంపూడి, సంపత్ నగర్, రామస్వామి పేట, కొండగుంటూరు, పరిజల్లిపేట, కనావరం , చక్రద్వారబంధం గ్రామాలకు సంబంధించి నిర్వహించిన, లక్కీడ్రాలో గెలిపోందిన 220 మంది మహిళ విజేతలకు బంగారు రూపులు, పట్టు చీరలు, పసుపు కుంకుమలను కంబాల దంపతులు ఉచితంగా పంపిణీ చేసారు. అలాగే 3,500 మంది మహిళలకు పట్టు చీరలు పంపిణీ చేసారు. శ్రావణమాసంలో ప్రతి పేద మహిళకు కూడా పట్టు చీరను అందించాలని ఉద్దేశంతో, గత నెల 11వ తేదీ నుంచి నేలాఖరి వరకు కంబాల కానుక వనితల వేడుక కార్యక్రమం ద్వారా ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలోని 50 గ్రామాల్లో మహిళలకు కంబాల శ్రీనివాసరావు పట్టు చీరలు పంపిణీ చేసారు. ఈ నెల 3 తేదినుంచి బంగారు వరలక్ష్మి కానుక సీజన్–4 కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. గోకవరం, కోరుకొండ, ఇందుకూరుపేట, రాజవొమ్మంగి, అడ్డతీగల, చవిటిదిబ్బలు, రంపచోడవరం, సీతానగరం, రాజానగరం మండలాల పరిధిలో గ్రామాలకు లక్కీడ్రా నిర్వహించి డ్రాలో గెలిపోందిన విజేతలకు బంగారు వరలక్ష్మి రూపులను ఉచితంగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కంబాల శ్రీనివాసరావు మాట్లాడుతూ మహిళల్లో హైందవ చైతన్యం తీసుకురావడం, శ్రావణమాసంలో ప్రతి పేద మహిళ బంగారు రూపుతో వరలక్ష్మి వ్రతం జరుపుకోవాలనే సంకల్పంతో 2023లో బంగారు వరలక్ష్మి కానుక కార్యక్రమానికి రూపకల్పన చేసామన్నారు. ఈ కార్యక్రమం గొప్ప విజయం కావడంతో ఈ ఏడాది సీజన్– 4 ప్రారంభించమన్నారు. 150 మంది సిబ్బందితో ఎక్కడ ఏటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా, పోలీసుల సహకారంతో ప్రతిష్టమైన చర్యలు తీసుకోవడం జరిగిందన్నారు. వచ్చిన ప్రతి వారికి కూడా భోజన రవాణా సౌకర్యం కనిపించడం జరిగిందన్నారు. లక్కీ డ్రాలో బంగారు రూపులు రాని మహిళలు నిరాశ చెందకుండా, ఒట్టి చేతులతో తిరిగి ఇంటికి వెళ్ళకుండా వారందరికీ పట్టుచీరలు, పసుపు కుంకుమను పంపిణీ చేయడం జరిగిందన్నారు. కులమతాలకు అతీతంగా డ్రాలో గెలిపొందిన ముస్లిం, క్రిస్టియన్ మహిళలకు కూడా బంగారు రూపులు పంపిణీ చేయడం జరిగిందన్నారు. నిన్నటి వరకు లక్ష పట్టు చీరలు పంపిణీ చేశామని, అలాగే మూడు మూడు నియోజకవర్గాల పరిధిలో నాలుగు వేల పైగా బంగారు రూపులను ఉచితంగా పంపిణీ చేసామని వెల్లడించారు. ప్రతిచోట కూడా అడుగడుగున, మహిళలు, నాయకులు, కార్యకర్తలు, స్థానిక ప్రజలు, నీరాజనాలు పట్టడం జరిగిందన్నారు. కనకదుర్గ అమ్మవారి ఆశీస్సులతో దిగ్విజయంగా ఈ కార్యక్రమం విజయవంతం అయ్యిందని ఆనందం వ్యక్తం చేశారు. ఇందుకు సహకరించిన నాయకులు, కార్యకర్తలు, మహిళలు, అభిమానులు, పోలీసులకు ప్రతి ఒక్కరికి కంబాల శ్రీనివాసరావు పేరు, పేరున ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

# వరలక్ష్మీ వ్రతం వేడుకలు



గోకవరం ఆగస్టు 21 జి ఎస్ బి వార్త : గోకవరం మండలంలో శుక్రవారం వరలక్ష్మీ వ్రతం వేడుకలు ఘనంగా జరిగాయి మండలం లోని పలు గ్రామాల్లో మహిళా మూర్తులు తెల్లవారుజామునే లేచి తలస్నానం లలో ఆచరించి రకాల పూలు పళ్ళతో వరలక్ష్మీ దేవిని ఘనంగా పూజించారు. అనంతరం గ్రామంలో గల ఆలయాలకు వెళ్లి పూజలు పూజలు నిర్వహించారు


# ఏపీపీ ఎస్సి --డిఎస్సి పై జగన్ వ్యాఖ్యలు గందరగోళం

### మాజీ ముఖ్యమంత్రి బాధ్యతాయుతంగా వ్యవహరించాలి: డా. పిట్టా వరప్రసాద్

విజయవాడ, ఆగస్టు 21,(జిఎస్ బి వార్త) : ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ఞ్ఞుాజ, ఞుాజ నియామకాలపై చేస్తున్న వ్యాఖ్యలు నిరుద్యోగ యువత, విద్యార్థులు, ఉద్యోగుల్లో గందరగోళం సృష్టించే విధంగా ఉన్నాయని డా. పిట్టా వరప్రసాద్ తీవ్రంగా ఖండించారు. మాజీ ముఖ్యమంత్రి హోదాలో ఉన్న వ్యక్తి ఒక అంశంపై విమర్శలు చేసే ముందు వాస్తవాలను పూర్తిగా తెలుసుకోవాలని ఆయన సూచించారు. ఏపీపీ ఎస్సి , డీఎస్సీ రెండూ వేర్వేరు నియామక వ్యవస్థలు కాగా, వాటిని ఒకే విధంగా చిత్రీకరించడం ద్వారా ఉద్యోగాల కోసం సిద్ధమవుతున్న లక్షలాది మంది అభ్యర్థులను అయోమయానికి గురిచేయడం సరికాదన్నారు. జగన్ మోహన్ రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలోనే ఏపీపీ ఎస్ సి కి సంబంధించిన కొన్ని పరీక్షలు, నియామక ప్రక్రియలపై వివాదాలు తలెత్తాయని, వాటిలో మూల్యాంకనం (జుజుశ్రీబ్ఘఅశీఅ) వంటి అంశాలపై న్యాయస్థానాల్లో కూడా అభ్యంతరాలు వ్యక్తమైన విషయాన్ని ఆయన గుర్తు చేశారు. గతంలో తమ ప్రభుత్వ హయాంలో జరిగిన పరిణామాలను విస్మరించి, ఇప్పుడు మొత్తం వ్యవస్థను తప్పుబట్టడం రాజకీయ ద్వంద్వ వైఖరికి నిదర్శనమన్నారు. అదేవిధంగా ఞుాజ విషయంలో పేపర్ లీకేజీ జరిగిందని, ఉద్యోగాలు అమ్ముకున్నారని, అవకతవకలు జరిగాయని ఆధారాలు లేకుండా రకరకాల ఆరోపణలు చేయడం ద్వారా అభ్యర్థుల్లో భయాందోళనలు కలిగించడం బాధ్యతారాహిత్యమని డా. పిట్టా వరప్రసాద్ అన్నారు. ఏదైనా అక్రమం జరిగిందని ఆధారాలు ఉంటే వాటిని బయటపెట్టి, సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేసి, న్యాయపరమైన మార్గాన్ని ఆశ్రయించాలి కానీ రాజకీయ వేదికలపై నిరాధార ఆరోపణలు చేయకూడదని ఆయన అన్నారు. నిరుద్యోగ యువత ఎన్నో సంవత్సరాలుగా ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్నారని, వారి భవిష్యత్తుతో రాజకీయాలు ఆడుకోవడం సరికాదన్నారు. ఉద్యోగ నియామకాలపై అనుమానాలు కలిగించే వ్యాఖ్యలు చేయడం వల్ల పరీక్షలకు సిద్ధమవుతున్న విద్యార్థుల మానసిక స్థైర్యం దెబ్బతింటుందని పేర్కొన్నారు. "మాజీ ముఖ్యమంత్రి స్థాయిలో ఉన్న వ్యక్తి ప్రజలకు దిశానిర్దేశం చేయాలి. కానీ ప్రతి నియామకాన్ని వివాదాస్పదం చేస్తూ, నిరుద్యోగ యువతను ఆందోళనలకు ప్రేరేపించడం ద్వారా వారికి నష్టం చేయకూడదు" అని డా. పిట్టా వరప్రసాద్ అన్నారు. అసెంబ్లీ సమావేశాల్లో ప్రజా సమస్యలపై చర్చ జరగాల్సిన సమయంలో ప్రతిపక్షం ప్రతి అంశాన్ని అడ్డుకోవడం, సభా కార్యక్రమాలను సజావుగా సాగనివ్వకపోవడం ప్రజాస్వామ్యానికి మంచిది కాదన్నారు. ప్రభుత్వం తీసుకునే ప్రతి నిర్ణయాన్ని వ్యతిరేకించడం కంటే, లోపాలు ఉంటే వాటిని నిర్మాణాత్మకంగా ఎత్తిచూపి ప్రత్యామ్నాయ పరిష్కారాలు సూచించాలని కోరారు. ప్రజాస్వామ్యంలో ప్రతిపక్షానికి ప్రశ్నించే హక్కు ఉన్నప్పటికీ, సభలో చర్చను అడ్డుకోవడం, బయట నిరసనలు నిర్వహించడం, ఉద్యోగ నియామకాలపై ఆధారాలు లేని ఆరోపణలు చేయడం ద్వారా ప్రజల్లో గందరగోళం సృష్టించడం ప్రతిపక్ష బాధ్యత కాదని ఆయన అన్నారు. యువతకు స్పష్టత ఇవ్వాలి రాష్ట్రంలో ఖాళీగా ఉన్న ప్రభుత్వ ఉద్యోగాలపై ప్రభుత్వం సమగ్ర శ్వేతపత్రం విడుదల చేయాలని, నియామక ప్రక్రియలకు స్పష్టమైన వార్షిక ఉద్యోగ క్యాలెండర్ ప్రకటించాలని డా. పిట్టా వరప్రసాద్ డిమాండ్ చేశారు. APPSC, DSC సహా అన్ని నియామక సంస్థల వ్యవహారాల్లో పారదర్శకత, మెరిట్, న్యాయబద్ధత ఉండేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఏ పరీక్షలోనైనా పేపర్ లీక్ లేదా అక్రమాలు జరిగాయని నిర్ధారణ అయితే బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని అన్నారు.

"నిరుద్యోగ యువతకు కావాల్సింది రాజకీయ గందరగోళం కాదు---ఉద్యోగం. వారికి కావాల్సింది ఆరోపణలు కాదు---పారదర్శక నియామకాలు. గత ప్రభుత్వ తప్పిదాలను కప్పిపుచ్చుకోవడం, ప్రస్తుత ప్రభుత్వ నియామకాలను అనవసరంగా వివాదాస్పదం చేయడం రెండూ సరికాదు. యువత భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని మాజీ ముఖ్యమంత్రి బాధ్యతాయుతమైన భాషలో మాట్లాడాలి" అని డా. పిట్టా వరప్రసాద్ స్పష్టం చేశారు.

# ప్రముఖ నటి షావుకారు జానకి మృతి పట్ల సినిమాటోగ్రఫీ మంత్రి కందుల దుర్గేష్ దిగ్భ్రాంతి



రాజమహేంద్రవరం:(జిఎస్ బి వార్త) : ప్రముఖ సీనియర్ నటి, పద్మశ్రీ 'షావుకారు' జానకి మృతి పట్ల రాష్ట్ర సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఆమె మరణం తెలుగు సినీ పరిశ్రమకు తీరని లోటని పేర్కొన్నారు. ""షావుకారు' చిత్రంతో సినీ ప్రేక్షకుల హృదయాల్లో చెరగని ముద్ర వేసుకొని 'షావుకారు జానకి'గా విశేష కీర్తి ప్రతిష్టలు సంపాదించుకున్నారు. రాజమహేంద్రవరంలో జన్మించిన ఆమె దశాబ్దాలకు పైగా సాగిన తన సుదీర్ఘ సినీ ప్రస్థానంలో తెలుగు, తమిళం, కన్నడ భాషల్లో 400కు పైగా చిత్రాల్లో నటించి, వైవిధ్యమైన పాత్రలతో సహజ నటనను ప్రదర్శించి కోట్లాది మంది అభిమానులను మెప్పించారు" అని గుర్తుచేసుకున్నారు. తెలుగు చిత్రసీమలో తన అభినయంతో చెరగని ముద్ర వేసిన షావుకారు జానకి మరణం కలిచివేసిందని ఆవేదన వ్యక్తం చేశారు..ఆమె పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుడిని ప్రార్థిస్తూ, వారి కుటుంబ సభ్యులకు, అభిమానులకు తన సానుభూతిని తెలిపారు.

# సాదిక్ లొంగిపోవాలి- దుష్ప్రచారం ఆపాలి

### ముస్లిం, మైనారిటీ జేఏసీ వినతి



కాకినాడ, ఆగస్ట్ 21:(జిఎస్ బి వార్త) : పంచాయతీరాజ్ ఏఈ నూకరాజు కుటుంబం ఆత్మహత్య విషయంలో ఆరోపణలు ఎదుర్కొంటున్న షేక్ సాదిక్ ఖాన్‌ను బేషరతుగా లొంగిపోయి విచారణకు సహకరించాలని కాకినాడ ముస్లిం మైనార్టీ జేఏసీ విభాగం కోరింది. ఈ సంఘటనపై ముస్లిం పైన దుష్ప్రచారానికి అడ్డుకట్ట వేయాలంటూ పేర్కొంది. నూకరాజు ఆత్మహత్య విషయంలో షేక్ సాదిక్ ఖాన్ పాత్ర పైన దానిని ముస్లిం సమాజంపై తప్పుడు ప్రచారం చేస్తున్న వారు ఇక ముగింపు పలకాలని హితవు పలికింది. శుక్రవారం ముస్లిం మైనార్టీ జేఏసీ కో- కన్వీనర్ ఎండి జవహర్ అలీ తన స్వగృహంలో ఈ ముస్లిం సమాజంపై సాదిక్ ఖాన్ అనే వ్యక్తి వస్తున్న దుష్ప్రచారంపై ఆయన ఖండించారు. నూకరాజు కుటుంబం మృతిలో ఆరోపణను ఎదుర్కొంటున్న సాదిక్ ఖాన్ లొంగిపోయి చట్టానికి సహకరించాలని సూచించారు. కొందరు వ్యక్తులు, కొన్ని ప్రసార మాధ్యమాలలో లవ్ జిహాదీ జరిగిందంటూ వస్తున్న ఆరోపణలను ఆయన కొట్టి పడేశారు. ఇది వ్యక్తిగత సమస్యని ముస్లిం సమాజంకు చెందినది కాదని చెప్పారు. ముస్లిం మతాన్ని లక్ష్యంగా చేసుకొని దుష్ప్రచారం చేయడం తగదని హితవు పలికారు. ప్రశాంతతకు పేరుగాంచిన కాకినాడలో మతసామరస్యం వెల్లివిరసాలని కోరారు. మరో ఐదు రోజుల్లో రానున్న మహమ్మద్ ప్రవక్త జన్మదినం మిలాదున్నబి పండుగ సందర్భంగా ముస్లిం, హిందువులు పరస్పరం సహకరించుకోవాలని జవహర్ అలీ సూచించారు. ఈ సమావేశంలో ముస్లిం నాయకులు షేక్ ఏజాజుద్దీన్, ఎండి అస్గర్ అలీ, ఎస్డి ఇమ్రాన్, ఎండి రహమతుల్లా షరీఫ్, ఇస్మాయిల్, ఇనాముల్లా, ఇమ్రాన్ హుస్సేన్, బాషా, జాకీర్, సానాఉల్లా తదితరులు పాల్గొన్నారు.

# కాకినాడ ఆర్టీసీ డిపో మేనేజర్‌గా రమా లక్ష్మీదేవి బాధ్యతల స్వీకరణ

కాకినాడ, ఆగస్టు 21:(జిఎస్ బి వార్త) కాకినాడ ఆర్టీసీ డిపో నూతన డిపో మేనేజర్‌గా గంగుమళ్ల రమా లక్ష్మీదేవి శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటివరకు అమలాపురం డిపోలో అసిస్టెంట్ మెకానికల్ ఇంజినీర్‌గా విధులు నిర్వహించిన ఆమెకు పదోన్నతిపై కాకినాడ డిపో మేనేజర్‌గా నియామకం లభించింది. ఇటీవల కాకినాడ జిల్లా ప్రజా రవాణా అధికారిగా పదోన్నతి పొందిన ఎంయువి మనోహర్ నుంచి ఆమె బాధ్యతలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ మేనేజర్ ఎ మాలిమ్ భాష, అసిస్టెంట్ మేనేజర్ (పర్సనల్) కే శ్రీనివాస్‌తో పాటు డిపో సిబ్బంది పాల్గొని నూతన డిపో మేనేజర్‌కు శుభాకాంక్షలు తెలిపారు.



RNI AP BIL14872/2024
వార్త
గోదావరి స్పెషల్ బులిటెన్



# ప్రయాణికులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు

## అన్నవరం ఆర్టీసీ బస్టాండ్‌ను ఆకస్మికంగా తనిఖీ చేసిన రవాణా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి



అన్నవరం (జిఎస్ బి వార్త) : శుక్రవారం కాకినాడ జిల్లా అన్నవరం బస్టాండ్‌లో రం ఆర్టీసీ బస్టాండ్‌ను ఆకస్మికంగా తనిఖీ చేసిన రవాణా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి ప్రయాణికులతో మాట్లాడి స్త్రీ శక్తి ఉచిత బస్సు ప్రయాణ పథకంపై మహిళా ప్రయాణికుల అభిప్రాయాలు తెలుసుకున్నారు. స్త్రీ శక్తి పథకం అమలుపై హర్షం వ్యక్తం చేసిన మహిళా ప్రయాణికులు సీఎం చంద్రబాబు నాయుడు సారథ్యంలో స్త్రీ శక్తిపథకంవిజయవంతంగా అమలవుతోందని మహిళల ప్రశంసలు కురిపించారు. ఈ సందర్భంగా అన్నవరం బస్టాండ్‌లో ప్రయాణికులకు అందుతున్న మౌలిక సదుపాయాలపై ఆరా తీసి పలు సూచనలు చేశారు. ప్రయాణికులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా మెరుగైన సదుపాయాలు కల్పించాలని అధికారులకు మంత్రి పలు సూచనలి చేశారు. అదేవిదంగా అన్నవరం ఆర్టీసీ క్యాంటీన్‌ను సందర్శించి,ఆర్టీసీ డ్రైవర్లు, కండక్టర్లు, సిబ్బందితో కలిసి అల్పాహారం తీసుకున్నారు. ఆర్టీసీ కార్మికులతో ఆత్మీయంగా మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నరు.

# పివైఎల్ ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా నూతన కమిటీ ఏకగ్రీవ ఎన్నిక





రామచంద్ర పురం , (జిఎస్ బి వార్త ) : రామచంద్రపురంలోని కామ్రేడ్ చెలికాని రామారావు స్మారక భవనంలో జరిగిన ప్రగతిశీల యువజన సంఘం (పివైఎల్) ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా 7వ మహాసభలో నూతన ఉమ్మడి జిల్లా కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా కలుగుల విజయ్‌కుమార్ (మారేడుమిల్లి), ప్రధాన కార్యదర్శిగా బత్తుల సిద్దు (రామచంద్రపురం) ఎన్నికయ్యారు. వీరితో పాటు మొత్తం 14 మందితో నూతన జిల్లా కమిటీ ఎన్నికైంది. మరో ఇద్దరిని కో–ఆప్షన్ సభ్యులుగా ఎన్నుకున్నారు. యువత సమస్యలపై పోరాటానికి మహాసభ తీర్మానాలు మహాసభలో నిరుద్యోగం, మాదకద్రవ్యాల విస్తరణ, విద్యార్థుల విద్యా సమస్యలు, ప్రభుత్వ ఉద్యోగాల భర్తీ, మహిళలు––విద్యార్థులపై జరుగుతున్న అత్యాచారాలు, హత్యలు, గిరిజన యువత సమస్యలు తదితర అంశాలపై పలు తీర్మానాలను ఏకగ్రీవంగా ఆమోదించారు.

ముఖ్య తీర్మానాలు:

1. రాష్ట్రంలోని నిరుద్యోగ యువతకు నెలకు రూ.3,000 నిరుద్యోగ భృతి అందించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. 2. మద్యం, గంజాయి, డ్రగ్స్ వంటి మాదకద్రవ్యాలను నిషేధించాలని, యువత భవిష్యత్తును నాశనం చేస్తున్న మాదకద్రవ్యాల వ్యాపారంపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. 3. నీట్ పేపర్ లీకేజీ, అవినీతి, అక్రమాల కారణంగా ఆత్మహత్యలకు పాల్పడిన విద్యార్థుల కుటుంబాలకు ఒక్కొక్క కుటుంబానికి రూ.1 కోటి నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. 4. ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఓసీ పేద విద్యార్థులకు అందాల్సిన స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ పెండింగ్ బకాయిలను తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. 5. ప్రభుత్వంలోని పోలీస్, రెవెన్యూ, సంక్షేమ, కార్మిక, విద్యా, వైద్య తదితర అన్ని శాఖల్లో ఖాళీగా ఉన్న అన్ని రకాల పోస్టులను వెంటనే భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. 6. ఎస్సీ, ఎస్టీ బ్యాక్‌లాగ్ పోస్టులను తక్షణమే భర్తీ చేయాలని కోరారు. 7. మహిళలు, విద్యార్థులు, మైనర్ బాలికలపై జరుగుతున్న అత్యాచారాలు, హత్యలను అరికట్టేందుకు ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. 8. గిరిజన యువతకు న్యాయం జరిగేలా ప్రత్యేక మెగా డీఎస్సీని ప్రకటించాలని ప్రభుత్వాన్ని కోరారు. 9. రాజమండ్రిలో మెడికల్ విద్యార్థిని ప్రియాంకను హత్య చేసిన నిందితులను కఠినంగా శిక్షించాలి. ఈ డిమాండ్ల సాధన కోసం జిల్లావ్యాప్తంగా యువతను సమీకరించి పోరాటాలను మరింత విస్తృతం చేయాలని నూతన కమిటీ నిర్ణయించింది. నూతన జిల్లా కమిటీ అధ్యక్షుడు: కలుగుల విజయ్‌కుమార్ –– మారేడుమిల్లి ప్రధాన కార్యదర్శి: బత్తుల సిద్దు –– రామచంద్రపురం జిల్లా ఉపాధ్యక్షుడు: సాతాల రామిరెడ్డి –– జగ్గంపేట సహాయ కార్యదర్శి: పి. అబ్బులు –– రంపచోడవరం కోశాధికారి: ఇల్లా చంద్రశేఖర్ –– రాజమండ్రి టౌన్

కార్యవర్గ సభ్యులు: వానపల్లి నాగరాజు –– రామచంద్రపురం పి. సుగ్గిరెడ్డి –– రంప ఏజెన్సీ బి. రమణ –– రాజమండ్రి రావి చిన్నబాబు –– కె. గంగవరం సీఎం నగేష్ –– రంప ఏజెన్సీ ఉంద్రు కార్తీక్ –– భీమక్రోసుపాలెం మురళి –– దేవీపట్నం ఆనంద్ –రంప ఏజెన్సీ బి. శ్రీను– పెద్దాపురం ఇతర సభ్యులు కలిపి మొత్తం 14 మందితో జిల్లా కమిటీ ఎన్నికైంది. మహాసభలో ఇద్దరు కో–ఆప్షన్ సభ్యులను కూడా ఎన్నుకున్నారు. పివైఎల్ ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా 7వ మహాసభ విజయవంతం కావడానికి సహకరించిన ప్రజా సంఘాల నాయకులు, కార్యకర్తలు, యువతీ యువకులు, కళాకారులు, మీడియా మిత్రులు, అభిమానులు, శ్రేయోభిలాషులందరికీ నూతన జిల్లా కమిటీ విప్లవ వందనాలు తెలియజేసింది. యువత సమస్యల పరిష్కారం కోసం ––– ఉద్యోగం, ఉపాధి కోసం ––– విద్యార్థుల హక్కుల కోసం ––– మాదకద్రవ్యాల నిర్మూలన కోసం పోరాటాలను మరింత ఉధృతం చేస్తామని పివైఎల్ నూతన ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా కార్యవర్గం ప్రకటించింది.

# కనుల పండుగగా దుర్గా మల్లేశ్వర స్వామి దివ్య కళ్యాణం



సామర్లకోట, ఆగస్టు 21, జి ఎస్ బి వార్త : సామర్లకోట శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి నవదుర్గ ఆలయంలో శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి దివ్య కళ్యాణ పూజలు శుక్రవారం సాయంత్రం కనుల పండుగ నిర్వహించారు. ఆలయ కార్య నిర్వహణ అధికారిణి, దేవి పుత్రిక కనక విజయలక్ష్మి ఆధ్వర్యంలో 14వ వార్షిక దివ్య కళ్యాణ మహోత్సవం ఘనంగా నిర్వహించారు. వేద పండితులు పూజ మల్లికార్జున శర్మ సారథ్యంలో జరిపించిన కళ్యాణ పూజల్లో శ్రీ మల్లేశ్వర స్వామి తరపున సామర్లకోట వాస్తవ్యులు మార్ని వెంకటేశ్వరరావు, వీరకుమారి దంపతులు, దుర్గామాత తరపున సామర్లకోట వాస్తవ్యులు వంక వీర్రాజు, వెంకటలక్ష్మి దంపతులు పీటలపై కూర్చుని స్వామివారి కల్యాణ పూజలు జరిపించారు. రాత్రి వరకు జరిగిన దివ్య కళ్యాణ పూజల్లో పాల్గొన్న భక్తులకు ప్రత్యేక ప్రసాదాలను అందజేశారు. ఈ కళ్యాణ పూజల్లో మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ గోలి వెంకట అప్పారావు చౌదరి, పెద్దాపురం మాజీ మున్సిపల్ చైర్మన్ రాజా సూరిబాబు రాజు, ప్రముఖ న్యాయవాది అనురాధ, మాజీ కౌన్సిలర్ కాపుగంటి పైడి రత్నం, ఆలయ కమిటీ నాయకులు, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

# "బెటర్ సిటీస్ –– అర్బన్ పాలిటిక్స్ క్యాంపెయిన్" పోస్టర్ ఆవిష్కరణ

రాజమహేంద్రవరం, ఆగష్టు 21:తూర్పుగోదావరి జిల్లా యువజన కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు గట్టి నవతారకేశ్ ఆధ్వర్యంలో బెటర్ సిటీస్ –– అర్బన్ పాలిటిక్స్ క్యాంపెయిన్ పోస్టర్ ఆవిష్కరణ జరిగింది. యూత్ కాంగ్రెస్ జాతీయ అధ్యక్షులు ఉదయ్ భాను చిబ్ ఆదేశాల మేరకు, ఐవైసీ జాతీయ ప్రధాన కార్యదర్శి లెనిన్, ఐవైసీ జాతీయ కార్యదర్శి మమతా నాగిరెడ్డి, యూత్ కాంగ్రెస్ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షులు పవన్ తేజ ఆదేశాల మేరకు "బెటర్ సిటీస్ –– అర్బన్ పాలిటిక్స్ క్యాంపెయిన్"లిలిను అన్ని పట్టణ ప్రాంతాల్లో నిర్వహిస్తున్నామని తారకేష్ తెలిపారు. మన రాజ్యాంగం ప్రతి ఒక్కరికీ సమాన హక్కులు కల్పించిందని,కానీ పట్టణాల్లో పనిచేస్తున్న పారిశుద్ధ్య కార్మికులు, వీధి వ్యాపారులు, గృహ కార్మికులకు ఆ హక్కులు పూర్తిగా అందడం లేదన్నారు. అందుకే రాజ్యాంగ హక్కులు ప్రతి ఒక్కరికీ అందేలా, వార్డు స్థాయి వరకు ప్రజల్లో అవగాహన కల్పించడమే ఈ క్యాంపెయిన్ ముఖ్య ఉద్దేశమని, ఈ కార్యక్రమంలో భాగంగా పట్టణాల్లో పనిచేస్తున్న వివిధ వర్గాల కార్మికులతో కలిసి కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా జనరల్ సెక్రటరీ పట్నాల శ్రీనివాసు, తేజ, అలాగే యూత్ కాంగ్రెస్ నాయకులు నందకిషోర్, స్వామి, , రమేష్, పవన్, సంపత్ తదితరులు పాల్గొన్నారు.

# వైభవంగా వరలక్ష్మీ వ్రత మహోత్సవాలు



పెదపూడి.( జి ఎస్ బి వార్త) : శ్రావణమాసం రెండో శుక్రవారం సందర్భంగా పెదపూడి మండలంలో ప్రసిద్ధ చెందిన శ్రీ ఉషా, పద్మిని, ఛాయా, సౌంజ్ఞ సమేత శ్రీసూర్యనారాయణ స్వామి, శ్రీ కోదండరామచంద్ర మూర్తి,అయ్యప్ప దేవాలయం, శ్రీ అలివేలు మంగ పద్మావతి సమేత శ్రీ వెంకటేశ్వర స్వామి దేవాలయాలు భక్తజన సందోహంతో కిటకిటలాడాయి. తెల్లవారుజాము నుంచే భక్తులు పెద్ద సంఖ్యలో ఆలయానికి చేరుకుని అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. శ్రావణమాసంలో రెండో శుక్రవారానికి ప్రత్యేక ప్రాధాన్యత ఉండటంతో మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని భక్తిశ్రద్ధలతో కుంకుమార్చనలు, అర్చనలు నిర్వహించారు. శ్రావణమాసం రెండో శుక్రవారం వరలక్ష్మీ వ్రతాలకు, అమ్మవారి ఆరాధనకు విశేషమైన రోజుగా భావిస్తారు.అలంకరించిన పుష్పాలతో ఆలయాలు ఆధ్యాత్మిక శోభను సంతరించుకున్నాయి. అమ్మవారిని ప్రత్యేకంగా సర్వాంగ సుందరంగా అలంకరించగా భక్తులు హారతులు సమర్పించి తమ కుటుంబాల సుఖశాంతులు, ఐశ్వర్యం, ఆరోగ్యం కోసం ప్రార్థనలు చేశారు. ఆలయ ప్రాంగణమంతా భక్తుల రాకపోకలతో సందడిగా మారింది. మహిళలు సంప్రదాయ వస్త్రధారణలో పాల్గొని వరలక్ష్మీ వ్రతాలు ఆచరించారు. అమ్మవారికి కొబ్బరికాయలు, పండ్లు, పూలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. వివాహిత మహిళలు తమ కుటుంబాల శ్రేయస్సు కోసం ప్రత్యేకంగా పూజలు నిర్వహించగా, యువతులు కూడా అమ్మవారి ఆశీస్సుల కోసం దర్శనానికి తరలివచ్చారు. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని ఆలయ కమిటీ ప్రత్యేక ఏర్పాట్లు చేసింది. దర్శనానికి వచ్చిన భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా తాగునీరు, క్యూలైన్లు, ప్రసాదాల పంపిణీ వంటి ఏర్పాట్లు చేశారు. ఆలయ అర్చకులు రేజేటి వెంకట నరశింహాచార్యులు, ఆరవిల్లి సుందర వీర రఘురామ్, మంజునాధాచార్యులు ప్రత్యేక పూజలు నిర్వహించి శ్రావణమాస విశిష్టతను భక్తులకు వివరించారు.శ్రావణమాసం మహిళలకు అత్యంత పవిత్రమైనదిగా భావిస్తారు. ముఖ్యంగా రెండో శుక్రవారం అమ్మవారి ఆరాధనకు విశేష ప్రాధాన్యత ఉండటంతో భక్తులు పెద్ద సంఖ్యలో ఆలయాలకు తరలివచ్చారు. ఈ నేపథ్యంలో ఆలయాల వద్ద భక్తుల రద్దీ నెలకొని ఆధ్యాత్మిక వాతావరణం వెల్లివిరిసింది. భక్తులకు ఎటువంటి లోటు లేకుండా ఆలయ చైర్మన్ లు ఏర్పాట్లు చేశారు. ఈ కార్యక్రమంలో నల్లమిల్లి వెంకటరమణారెడ్డి, సబ్బెళ్ల వెంకట రెడ్డి(చిన్న), కొవ్వూరి అప్పారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

# ఆలయంలో హుండీ ప్రారంభం



పెద్దాపురం, ఆగస్టు 21, జి ఎస్ బి వార్త : పెద్దాపురం పట్టణంలోని శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయంలో భక్తుల హుండీని శుక్రవారం ప్రారంభించారు. ఇండియన్ ఓవర్ సీస్ బ్యాంకు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన హుండీని ఆలయ అధికారి కె జగదీశ్వర రావు ఆధ్వర్యంలో ప్రారంభించారు. దేవాలయ అభివృద్ధిలో భాగంగా భక్తుల సౌఖర్యార్థం నూతన హుండీని ఏర్పాటు చేసినట్టు ఆలయ అధికారి జగదీశ్వర రావు చెప్పారు. ఈ కార్యక్రమంలో శ్రీ వెంకటేశ్వర స్వామి, శ్రీ చంద్రశేఖర స్వామి ఆలయాల ధర్మకర్తల మండలిల సభ్యులు, బ్యాంకు అధికారులు పాల్గొన్నారు.

# సబ్ జూనియర్,జూనియర్ సాఫ్ట్ బాల్ సెలెక్షన్స్



ఐ. పోలవరం ఆగస్ట్21( జియస్ బి వార్త) ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా సబ్ జూనియర్, జూనియర్ సాఫ్ట్ బాల్ బాలురు మరియు బాలికల సెలక్షన్స్ ఆదివారం ది.23-8-2026 న జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల జి వేమవరం ఐ పోలవరం డా. బి ఆర్అంబేద్కర్ కోనసీమ జిల్లా లో జరుగుతాయి అని ఉమ్మడి తూ గో జిల్లా సాఫ్ట్ బాల్ అసోసియేషన్ సెక్రటరీ అడ్డగళ్ల నాగ రాంప్రసాద్ తెలిపారు.. ఉదయం 9 గంటలకు రిపోర్ట్ చెయ్యాలి..అని సబ్ జూనియర్ కేటగిరి 1/1/2012 తరువాత జన్మించిన వారు అర్హులు జూనియర్ కేటగిరి 1/1/2009 తరువాత జన్మించిన వారు అర్హులు క్రీడాకారులు తప్పనిసరిగా జనన ధ్రువ పత్రం,ఒరిజినల్ ఆధార్ కార్డు మరియు రెండు జిరాక్స్ కాపీలు రెండు పాస్ పోర్ట్ ఫోటో లు తీసుకొని రావాలనిఎంపిక అయిన సబ్ జూనియర్ జిల్లా టీమ్ సెప్టెంబర్ రెండవ వారం లో విజయనగరం జిల్లా బొబ్బిలి లో జూనియర్ టీమ్ అక్టోబర్ రెండో వారం లో కడప జిల్లా పుల్లంపేట లో జరిగే స్టేట్ మీట్ లో పాల్గొంటారు అని అడ్డగళ్ల నాగ రాంప్రసాద్ సెక్రటరీ ఉమ్మడి తూ గో జిల్లా సాఫ్ట్ బాల్ అసోసియేషన్ తెలిపారు 99493 94568 ఈ నెంబర్లు సంప్రదించాలని రాంబాబు తెలిపారు.


# ధర్నా నోటీసు అందజేత

అనపర్తి ఆగస్టు 21 ( జి ఎస్ బి వార్త) ఆంధ్రప్రదేశ్ మెడికల్ అండ్ హెల్త్ కాంట్రాక్ట్ ఎంప్లాయిస్ జాయింట్ యాక్షన్ కమిటీ పిలుపుమేరకు ధర్నా నోటీసును ఏరియా హాస్పిటల్ అనపర్తి సూపరిండెంట్ డాక్టర్ రామగురెడ్డి కి అందజేయడం జరిగింది. ప్రధానంగా కాంట్రాక్టు ఉద్యోగులను రెగ్యులర్ చేయవలసిందిగా రెగ్యులర్ అయ్యే లోపు కాంట్రాక్టు ఉద్యోగులు అందరికీ 100% గ్రాస్ శాలరీ ఇవ్వవలసిందిగా కోరారు.క. ఈ కార్యక్రమంలో రేడియోగ్రాఫర్ కె విజయ్ కుమార్, ఫార్మసిస్ట్ మీనా,కౌన్సిలర్ చైతన్య రాజు,స్టాఫ్ నర్సులు పద్మావతి, శ్రీ ఆదిలక్ష్మి పాల్గొన్నారు.



# కాకినాడ జీజీహెచ్‌లో అధునాతన క్యాన్సర్ చికిత్సా కేంద్రం

- రూ. 36.6 కోట్లతో రేడియోథెరపీ లీనాక్ యంత్రం
- ఫలించిన ఉప ముఖ్యమంత్రివర్యుల కృషి..
- ఏడు జిల్లాల పరిధిలో క్యాన్సర్ రోగులకు ఉపయుక్తం
- త్వరలో అందుబాటులోకి రానున్న రూ. 3.5 కోట్ల మొబైల్ క్యాన్సర్ స్క్రీనింగ్ వాహనం
- సహకరించిన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాధినేతలకు కృతజ్ఞతలు తెలిపిన పవన్ కళ్యాణ్




కాకినాడ, (జిఎస్ బి వార్త ) : కాకినాడ ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిలో అధునాతన క్యాన్సర్ చికిత్సా కేంద్రం ఏర్పాటుకు రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ చేసిన కృషి ఫలించింది. రూ. 36.6 కోట్ల వ్యయంతో అత్యాధునిక డ్యూయల్ ఎనర్జీ లీనియర్ యాక్సిలేటర్ (లైనాక్ ) యంత్రం మంజూరైంది.పవన్ కళ్యాణ్ ప్రత్యేక చొరవ, నిరంతర సంప్రదింపులతో ఓఎన్‌జీసీ సంస్థ సీఎస్ఆర్ నిధుల నుంచి ఇందుకు అవసరమైన నిధులు అందిస్తోంది. దీంతోపాటు సీటీ సిమ్యులేటర్, హెచ్‌డీఆర్ బ్రాకీథెరపీ యంత్రం, డోసిమెట్రీ తదితర వ్యవస్థలకు సంబంధించిన పరికరాలను అందించాలని ప్రతిపాదించారు. పవన్ కళ్యాణ్ చొరవతో క్యాన్సర్‌ను ప్రారంభ దశలోనే గుర్తించేందుకు మొబైల్ క్యాన్సర్ స్క్రీనింగ్ వాహనం కూడా త్వరలో అందుబాటులోకి రానుంది. ఇప్పటికే రూ. 7 కోట్ల రెడ్ క్రాస్ నిధులతో చేపట్టిన అధునాతన భవనం నిర్మాణం తుది దశలో ఉంది. ఈ భవనంలో రేడియో థెరపీ బంకర్ ఏర్పాటుకు ఇప్పటికే పూణేలోని అటామిక్ ఎనర్జీ రీసెర్చ్ బోర్డు అనుమతి ఇచ్చింది. ఈ బంకర్ లోనే లీనాక్ యంత్రాన్ని అమర్చనున్నారు. ఈ చికిత్సా కేంద్రం ద్వారా కాకినాడ జిల్లాతో పాటు డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ, తూర్పుగోదావరి, అనకాపల్లి, పోలవరం తదితర జిల్లాల పరిధిలోని వందలాది మంది రోగులకు అత్యాధునిక క్యాన్సర్ వైద్య సేవలు అందుబాటులోకి రానున్నాయి. కాకినాడ సర్వజన ఆసుపత్రి ప్రస్తుతం క్యాన్సర్ రిఫరల్ కేంద్రంగా మాత్రమే సేవలు అందిస్తోంది రెండు దశాబ్దాలుగా ఎలాంటి ఆధునికీకరణ లేకపోవడంతో ఆంకాలజీ సేవలు పూర్తి స్థాయిలో అందించలేని పరిస్థితి ఉంది. క్యాన్సర్ చికిత్స కోసం హైదరాబాద్, చెన్నై, విశాఖపట్నం వంటి ప్రాంతాలకు వెళ్లాల్సి వస్తోంది. డ్యూయల్ ఎనర్జీ లీనియర్ యాక్సిలేటర్ (లైనాక్ ) యంత్రం ఏర్పాటుతో చికిత్స నిమిత్తం సుదూర ప్రాంతాలకు వెళ్తున్న నిరుపేద క్యాన్సర్ రోగులకు ఉపశమనం కలిగించనుంది. ప్రస్తుతం ఇక్కడ ఒక ప్రొఫెసర్, అసోసియేట్ ప్రొఫెసర్, ఇద్దరు అసిస్టెంట్ ప్రొఫెసర్లు, ఒక సీనియర్ రెసిడెంట్, రేడియేషన్ సేఫ్టీ ఆఫీసర్ తో పాటు 15 మంది జూనియర్ రెసిడెంట్ల సేవలు అందుబాటులో ఉండగా, అధునాతన యంత్ర సామాగ్రి అందుబాటులోకి రావడంతో నిపుణుల సేవలు పూర్తి స్థాయిలో అందుబాటులోకి రానున్నాయి. ఈ ప్రాజెక్టు అమలుకు కేంద్ర ప్రభుత్వ సహకారం లభించడంపై ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ హర్షం వ్యక్తం చేశారు. కాకినాడ జీజీహెచ్ కి డ్యూయల్ ఎనర్జీ లీనియర్ యాక్సిలేటర్ (లైనాక్ ) యంత్రం మంజూరుతో పాటు ప్రజారోగ్య రంగాన్ని బలోపేతం చేయడంలో ఎల్లప్పుడూ సహకారం అందిస్తున్న ప్రధానమంత్రి నరేంద్ర మోడీ కి, కేంద్ర పెట్రోలియం, సహజ వాయు శాఖ మంత్రి హరదీప్ సింగ్ పూరి కి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. అలాగే రాష్ట్ర ప్రజల ఆరోగ్య సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తూ ఈ ప్రతిపాదనకు సంపూర్ణ సహకారం అందించిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కి, అన్ని విధాలుగా తోడ్పాటును అందించిన ఓఎన్‌జీసీ ఛైర్మన్ శ్రీ అరుణ్ కుమార్ సింగ్ గారికి, రెడ్‌క్రాస్ యాజమాన్యానికి ధన్యవాదాలు తెలిపారు. రాష్ట్రంలో మెరుగైన వైద్య సేవలు అందుబాటులోకి తీసుకురావడం కూటమి ప్రభుత్వ లక్ష్యమని, ప్రజలకు అత్యాధునిక ఆరోగ్య సదుపాయాలను చేరువ చేయడానికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ పేర్కొన్నారు.

# చెరువులను ఎండబెట్టి అక్రమ మట్టి రవాణాకు కుట్ర చేశారు

## మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సూర్యనారాయణ రెడ్డి ఆరోపణ




అనపర్తి ఆగస్టు 21( జి ఎస్ బి వార్త ) ఎల్ నినో తో ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డి బాగుపడ్డారని వైసిపి నియోజకవర్గ సమన్వయకర్త,మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణ రెడ్డి ఆరోపించారు. వైసీపీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ చెరువులను ఎండబెట్టి మట్టి అక్రమ రవాణాకు కుట్ర చేశారని, సాగునీరు అందక ఎండిపోతున్న చెరువులు ఎండిపోతున్నాయి అన్నారు. గోదావరిలో నీరున్నా చెరువులు ఎందుకు నింపడం లేదు అని ప్రశ్నించారు. ఇటీవల అసెంబ్లీలో ఎల్ నినో ప్రభావం, దానికి సంబంధించిన నష్టాల గురించి మాట్లాడిన ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డి, ఆచరణలో మాత్రం తన స్వలాభం కోసం రైతాంగాన్ని తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నారని మాజీ ఎమ్మెల్యే ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రపంచమంతా ఎల్ నినో వల్ల కష్టాలు ఎదుర్కొంటుంటే, అనపర్తి నియోజకవర్గంలో మాత్రం దానిని వంకగా చూపుతూ ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డి లాభపడ్డారని విమర్శించారు. రంగంపేట మండలంలోని పెద్ద చెరువులకు చాగలనాడు, వెంకటనగరం ఎత్తిపోతల పథకాల ద్వారా గోదావరి నీరు వస్తుందని, వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ హయాంలో నేను ఎమ్మెల్యేగా ఉండగా ప్రతి చెరువును నింపి రెండు పంటలకు పుష్కలంగా నీరందించామని గుర్తుచేశారు. కానీ ప్రస్తుతం గోదావరిలో వరద నీరు పుష్కలంగా ప్రవహిస్తున్నప్పటికీ చెరువులలోకి నీటిని ఎందుకు విడుదల చేయడంలేదని సూర్యనారాయణ రెడ్డి ప్రశ్నించారు. ఈ పరిస్థితి వెనుక పెద్ద కుట్ర ఉందని, రంగంపేట మండలంలోని చెరువుల్లో ఎమ్మెల్యే తన అనుచరులు, బినామీలతో కలిసి కోట్లాది రూపాయల విలువైన మట్టిని అక్రమంగా తవ్వి తరలించడానికే నీటిని రానివ్వడం లేదని సూర్యనారాయణ రెడ్డి అన్నారు. చెరువుల్లో నీరు ఉంటే మట్టి తవ్వకాలకు ఆటంకం కలుగుతుందనే ఉద్దేశంతోనే నీటిని నిలిపివేసి, ఎల్ నినో వంకతో చెరువులను ఎండబెట్టారని మండిపడ్డారు. మట్టి అక్రమ రవాణా ద్వారా డబ్బులు సంపాదించడానికి ఈ రకమైన చర్యలకు ఒడిగట్టారని, ఒకవైపు చెరువులను ఎండబెడుతూనే మరోవైపు అసెంబ్లీలో ఏమీ తెలియనట్లు అమాయకంగా నటిస్తూ నీటి ఎద్దడిపై చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరడం విడ్డూరంగా ఉందని ఎద్దేవా చేశారు. అసలు చర్యలు తీసుకోవాల్సి వస్తే రైతులకు ద్రోహం చేసి చెరువులను ఎండబెట్టిన ఎమ్మెల్యే పైనే ముందుగా చర్యలు తీసుకోవాలని వ్యాఖ్యానించారు. సొంత లాభం కోసం రైతుల పొట్ట కొట్టవద్దని, ఇప్పటికైనా అబద్ధపు ప్రగల్భాలు ఆపి వెంటనే ఎత్తిపోతల పథకాల ద్వారా చెరువులను నీటితో నింపి రైతాంగాన్ని ఆదుకోవాలని డిమాండ్ చేశారు.

# సప్పా దుర్గాప్రసాద్ కూ రాజీవ్ గాంధీ పురస్కారం

రాజమహేంద్రవరం, ఆగస్టు 21:భారత మాజీ ప్రధాని, దివంగత రాజీవ్ గాంధీ జయంతి సందర్భంగా మాజీ పార్లమెంట్ సభ్యులు జీ వీ.హర్ష కుమార్ ప్రతిష్టాత్మకమైన రాజీవ్ గాంధీ సద్భావన అవార్డును విఖ్యాత నాట్య పండితులు డాక్టర్ సప్పా దుర్గాప్రసాద్ కు అందజేశారు. ఎన్నో పరిశోధనలు చేసి, మరెన్నో గ్రంథాలు రచించి ఆలయ నృత్యం –యజ్ఞనర్తనం పునః సృష్టి గావించి, బహు కళావేత్తగా రాజమహేంద్రవరం నగరానికి అంతర్జాతీయ ఖ్యాతిని అందించిన ఋషితుల్యులు డాక్టర్, సప్పా దుర్గాప్రసాద్ కి రాజీవ్ గాంధీ సద్భావన పురస్కారం అందించడంతో రాజీవ్ గాంధీ కళాశాలల ప్రతిష్ట మరింత పెరిగిందని హర్ష కుమార్ అన్నారు.హర్ష కుమార్ కుటుంబ సభ్యుల చేతి మీదుగా ఘనమైన జ్ఞాపిక, పట్టు వస్త్రాలు, శాలువా తో పాటుగా 50వేల రూపాయలు నగదు అవార్డు రూపంలో అందించారు. ఈ సందర్భంగా జి. వి.హర్ష కుమార్ కుటుంబ సభ్యులకు సప్పా దుర్గాప్రసాద్ కృతజ్ఞతలు తెలియజేసారు.తనకు నగదు పురస్కారాలు తీసుకునే అలవాటు లేదని, గతంలో రాష్ట్రపతి, ద్రవిడ, తెలుగు విశ్వవిద్యాలయాలు, దేశ విదేశాల్లోని అనేక సాంస్కృతిక సంస్థలు, రాష్ట్ర ప్రభుత్వం అందించిన నగదు పురస్కారాలను తిరిగి వారికే ఇచ్చివేయడం జరిగిందని అన్నారు.హర్ష కుమార్ కుటుంబ సభ్యుల అభ్యర్థన మేరకు ఈ నగదును తాను రచించిన గ్రంథాల ముద్రణకు వినియోగించి, ఆ గ్రంథాలను హర్ష కుమార్ దంపతులకు అంకితం ఇస్తానని తెలిపారు.అత్యంత ఘనంగా జరిగిన ఈ కార్యక్రమంలో రాజీవ్ గాంధీ కళాశాలల మాజీ ప్రిన్సిపల్ మేరీ జోన్స్ కి లైఫ్ టైం అచీవ్మెంట్ పురస్కారం కూడా అందించడం జరిగింది.జి. వి. హర్షకుమార్ సతీమణి సరళకుమారి,రాజీవ్ గాంధీ కళాశాలల డైరెక్టర్లు అన్విత శ్రీ రాజ్, అంకిత సుందర్ దంపతులు, కళాశాలలో ప్రిన్సిపాల్, నాగరాణి, థామస్ అబ్రహం, కళాశాలల అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థినీ విద్యార్థులు, సప్పా వారి శిష్యులు వారి తల్లిదండ్రులు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొని అభినందనలతో, పూలమాలలతో పురస్కార గ్రహీతలను సత్కరించారు.

Printed&published by on behalf (owner) Editor : GUNIPE SOBHAN BABU , Divya Publications, 4-160, DIWAN THOTA, PENUGUDURU, KAKINADA, ANDHRA PRADESH - 533016. printed at Rainbow printers ,6-84, SAIBABAPUNTHA ROAD, HUKUMPETA, RAJAHMUNDRY RURAL, EAST GODAVARI, ANDHRA PRADESH - 533107.RNI APBIL/26/A4072.email sobhangunipe@gmail.com.cell 9848899351.